నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 27-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:115 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

రాష్ట్రపు క్షేమము గోరిన
రాష్ట్రజులను దలచుకొనుచు లక్నో లోనన్
"రాష్ట్రీయ ప్రేరణాస్థలు"
రాష్ట్రీయ నరేంద్ర మోడి ప్రారంభించెన్ !!

(రాష్ట్రపు క్షేమం కోసం పనిచేసిన వారి విగ్రహాలతో లక్నోలో ''రాష్ట్రీయ ప్రేరణాస్థల్'' ను నరేంద్ర మోడీ ప్రారంభించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210

బుర్క

సర్పంచ్ పవరామెదే
స్వతహాగా సాగే బాట
భర్తనే అనుభవించే
బినామీగా ఆమె కోట.
రాజకీయ అధికారం
రూపుమారే నేడు ఇట్ల
సర్కారు దృష్టి పెట్టి
సరిచేయక పోతే ఎట్ల

-వేల్పుల నారాయణ
9440433475

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

-న్యూ ఇయర్ వేడుకలపై డేగ కన్ను
-హైదరాబాద్ వీసీ.సజ్జనార్



హైదరాబాద్, డిసెంబర్ 26:కొత్త ఏడాది వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ 'జీరో డ్రగ్స్' లక్ష్యంతో కఠినమైన యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించారు. నూతన సంవత్సర వేడుకల ముసుగులో డ్రగ్స్ మహమ్మారి విచ్చలవిడిగా ప్రవహించకుండా అడ్డుకోవడమే ధ్యేయంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

శుక్రవారం తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించే పబ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లపై కనికరం లేకుండా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వాటి లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తామని హెచ్చరించారు. వేడుకల నిర్వహణకు రాత్రి 1 గంట వరకు మాత్రమే అనుమతి ఉందని, ఆ సమయం దాటితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

నగరంలోని ప్రధాన కూడళ్లు, పబ్‌లతో పాటు సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీలపైనా నిఘా పెట్టేందుకు హెచ్-న్యూ, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారి కదలికలను నిశితంగా గమనించాలని, డ్రగ్స్ సరఫరాదారులు, వినియోగదారుల జాబితాను సిద్ధం చేసి వారిపై డేగ కన్ను వేయాలని అధికారులను ఆదేశించారు.

నగరానికి కొత్తగా వచ్చేవారి వివరాలను కూడా ఆరా తీస్తున్నామని, ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని సీపీ వివరించారు. మైత్రీవనం, నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్ వంటి రద్దీ ప్రాంతాల్లో భారీగా చెక్ పోస్టులు, బ్యారికేడింగ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకల సమయంలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పోలీసు సిబ్బందికి సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో పాటు డ్రగ్స్ పరీక్షలపైనా పోలీసులు ఈసారి ప్రత్యేక శ్రద్ధ కనబరచనున్నారు.

ఈ సమీక్షా సమావేశంలో డీసీపీలు ఎన్.శ్వేత, అపూర్వ రావు, రక్షిత కృష్ణమూర్తి సహా పలువురు ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. పోలీసులందరూ సమన్వయంతో పనిచేసి నగరంలో శాంతిభద్రతలను కాపాడాలని, డ్రగ్స్ రహిత వేడుకలకు సహకరించాలని సీపీ సజ్జనార్ నగరవాసులకు పిలుపునిచ్చారు.

చలి పులి పంజా.. దారుణంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, డిసెంబర్ 26:తెలంగాణను చలిపులి వణికిస్తోంది. భానుడి భగభగలు మాయమై.. ఎముకలు కొరికే చలి పంజా విసురుతోంది. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టాలంటేనే గజగజ వణికిపోతున్నారు. వీటికి తోడు చల్లటి గాలులు సైతం వీస్తున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంటర్నెట్ డెస్క్: తెలంగాణను చలిపులి వణికిస్తోంది. భానుడి భగభగలు మాయమై.. ఎముకలు కొరికే చలి పంజా విసురుతోంది. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టాలంటేనే గజగజ వణికిపోతున్నారు. వీటికి తోడు చల్లటి గాలులు సైతం వీస్తున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిన్నెధరలో 6.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. సిర్పూర్ లో 7, కేరమరిలో 8.7 డిగ్రీలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగర ప్రజలు కూడా చలి దెబ్బకు గజగజ వణుకుతున్నార. ఆయా ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం పై వీడియోను వీక్షించండి.

నేడు ఢిల్లీలో కాంగ్రెస్ అత్యున్నత స్థాయి సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 26:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఢిల్లీ పర్యటనకు బయలుదేరారు

. రేపు (శనివారం) జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అత్యున్నత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు.

ఢిల్లీలో కొత్తగా నిర్మించిన ఏఐసీసీ కార్యాలయం 'ఇందిరా భవన్' వేదికగా ఉదయం 10:30 గంటలకు కీలక భేటీ ప్రారంభం కానుంది.

పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో దేశవ్యాప్త రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతంపై చర్చించనున్నారు.

ముఖ్యంగా ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేయడంపై కాంగ్రెస్ తన నిరసనను వ్యక్తం చేయడంతో పాటు, భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేయనుంది.

రానున్న ఎన్నికల వ్యూహాలు, వివిధ రాష్ట్రాల, రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు పలువురు కేంద్ర పెద్దలను కూడా కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం. తెలంగాణలో అమలవుతున్న గ్యారెంటీలు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను ఆయన అధిష్టానానికి వివరించనున్నారు.

'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా సైనికులకు టీ, లస్సీ అందించిన బాలుడు..దక్కిన బాల పురస్కార్ అవార్డు

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పదేళ్ల బాలుడు తన వంతుగా సైనికులకు సేవలందించాడు. టీ, స్నాక్స్, పాలు, లస్సీ వంటివి వారికి అందజేశాడు. నాటి నుంచి ప్రశంసలు పొందిన ఆ బాలుడికి బాల పురస్కార్ అవార్డు దక్కింది. (ఃజీశ్రీ ఖబీతీజీబనిజీతీ) పంజాబ్ ఫిరోజ్‌పూర్ జిల్లాలోని సరిహద్దు ప్రాంతంలో నివసించే శ్రావణ్ సింగ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ ప్రదానం చేశారు.

కాగా, బాల పురస్కార్ అవార్డు తనకు రావడం చాలా సంతోషంగా ఉన్నదని శ్రావణ్ సింగ్ తెలిపాడు. తనకు ఈ అవార్డు దక్కుతుందని ఎప్పుడూ ఊహించలేదని చెప్పాడు. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా సైనికులకు చేసిన సేవల గురించి వివరించాడు. 'పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పుడు సైనికులు మా గ్రామానికి వచ్చారు. వారికి సేవ చేయాలని నేను అనుకున్నా. నేను రోజూ వారి కోసం పాలు, టీ, మజ్జిగ, ఐస్ తీసుకెళ్లేవాడిని' అని మీడియాకు తెలిపాడు.

మరోవైపు ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులతో సహా 26 మందిని ఉగ్రవాదులు కాల్చి చంపారు. దీనికి ప్రతీకారంగా మే నెలలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగడంతో పాకిస్థాన్ భారీ నష్టాన్ని చవిచూసింది. పాక్ కీలక ఎయిర్‌బేస్‌లు ధ్వంసం కావడంతో కాళ్లబేరానికి దిగి వచ్చింది. చివరకు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నది.

సోయా రైతులను కేంద్రం ఆదుకోవాలి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరిన మంత్రి జూపల్లి..

ఆదిలాబాద్, డిసెంబర్ 26: ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ రైతుల ఆందోళన దృష్ట్యా నాఫెడ్ ద్వారా తక్షణమే సోయాబీన్ కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇవాళ నేరడిగొండ మార్కెట్ యార్డులో రైతుల సమస్యలు తెలుసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ ద్వారా తక్షణమే కొనుగోలు చేపట్టి న్యాయం చేయాలన్నారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల సోయాబీన్ పంట నాణ్యత దెబ్బతినడంతో పాటు సోయాబీన్ రంగు మారిదంని, ఇది రైతులకు మరింత శాపంగా మారిందని వివరించారు. మార్కెట్ యార్డుల్లో రైతులు తమ పంటను విక్రయించేందుకు రోజుల పడి కాపులు కాస్తున్నారన్నారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో గ్రామాల్లోని రైతుల ఇళ్లలోనే సోయా నిల్వలు పేరుకుపోయాయి. కేంద్రం చొరవ తీసుకుంటేనే రైతులకు మద్దతు ధర దక్కుతుందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు నేరడిగొండ మార్కెట్ యార్డును ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ పంట నిల్వతో వేచి ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని వారికి హామీ ఇచ్చారు.

సోయాబీన్ కొనుగోళ్లలో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించాలని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయ శాఖకు లేఖ రాశారని మంత్రి జూపల్లి ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కేంద్రం కూడా సానుకూలంగా స్పందించి నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువ సాఫ్ట్‌వేర్ మృతి

హైదరాబాద్, డిసెంబర్ 26:అతివేగం ఓ యువకుడి ప్రాణాన్ని బలి తీసుకుంది. నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువ సాఫ్ట్‌వేర్ ప్రాణాలు కోల్పోయాడు. వరంగల్ జిల్లాకు చెందిన పునీత్ యాదవ్ (23) గౌలిదొడ్డిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై పునీత్, అతడి స్నేహితుడితో కలిసి గౌలిదొడ్డి నుంచి గచ్చిబౌలికి వస్తున్నాడు. అయితే పునీత్ వేగంగా బైక్‌ను నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.

ఈ క్రమంలో పునీత్, అతడి స్నేహితులు కిందపడిపోయారు. అయితే బైక్ నడుపుతున్న పునీత్ యాదవ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న అతడి స్నేహితుడు మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడ్డ వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే పునీత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సిరియా మసీదులో బాంబు పేలుడు.. 8 మంది మృతి, 18 మందికి గాయాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: శుక్రవారం ప్రార్థనల సమయంలో మసీదులో బాంబు పేలింది. ఈ సంఘటనలో 8 మంది మరణించారు. మరో18 మంది గాయపడ్డారు.

ఈ బాంబు పేలుడుకు ఉగ్రవాదులు కారణమని ఆ దేశ మంత్రి ఆరోపించారు. సిరియాలోని హోమ్స్ నగరంలో ఈ సంఘటన జరిగింది. మైనారిటీ కమ్యూనిటీ ప్రాంతమైన అలవైట్‌లోని వాడి అల్-దహాబ్ పరిసరాల్లోని మసీదులో బాంబు పేలింది. శుక్రవారం ప్రార్థనల సందర్భంగా ఇమామ్ అలీ బిన్ అబి తాలిబ్ మసీదు లోపల ఈ పేలుడు సంభవించినట్లు ఆ దేశ మీడియా తెలిపింది. ఈ బాంబు దాడిలో 8 మంది మరణించగా 18 మంది గాయపడినట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు.

కాగా, సిరియా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా ఈ బాంబు పేలుడును ధృవీకరించింది.

ఉగ్రవాద దాడిగా పేర్కొంది. శుక్రవారం ప్రార్థనలు జరుగుతుండగా ఉగ్రవాదులు మసీదును లక్ష్యంగా చేసుకున్నట్లు మీడియాకు వెల్లడించింది.

అనుమానంతో భార్యకు నిప్పు పెట్టిన భర్త..

హైదరాబాద్, డిసెంబర్ 26:నగరంలోని నల్లకుంటలో దారుణం జరిగింది. అనుమానంతో కట్టుకున్న భార్యను దారుణంగా హత్య చేశాడు భర్త. అది కూడా పిల్లల ముందే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భార్యపై విచక్షణారహితంగా దాడి చేయడమే కాకుండా ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే..

నల్గొండ జిల్లా హుజురాబాద్‌కు చెందిన దంపతులు వెంకటేశ్, త్రివేణి నల్లకుంటలో నివాసం ఉంటున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను వెంకటేశ్ తరచూ అనుమానిస్తుండే వాడు. ఈ విషయంపై భార్యను తీవ్రంగా వేధించేవాడు. వారి మధ్య తరచూ గొడవలు జరిగేవి. తాజాగా భర్త వేధింపులు తాళలేక భార్య త్రివేణి పుట్టింటికి వెళ్లింది. దీంతో అక్కడికి వెళ్లిన వెంకటేశ్.. తాను మారానని, ఇకపై బాగా చూసుకుంటానంటూ నమ్మించి త్రివేణిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. అయితే తీసుకొచ్చిన కొద్దిరోజులకే ఆమెను అతి దారుణంగా చంపేశాడు. ఎప్పటిలాగే అనుమానంతో భార్యతో గొడవకు దిగి విచక్షణ మరిచి ఆమెపై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా త్రివేణిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు.

అడ్డుకున్న కూతురినీ మంటల్లో తోసేసిన వెంకటేశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. అరుపులు, కేకలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసి ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే త్రివేణి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తిరుమలలో భారతీయ విజ్ఞాన సమ్మేళనం

తిరుపతి, డిసెంబర్ 26:తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యాలయంలో ఏడో భారతీయ సమ్మేళనం ఈ రోజు అంటే..శుక్రవారం ప్రారంభంకానుంది. ఈ సమ్మేళనం నాలుగురోజుల పాటు జరగనుంది.తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యాలయంలో ఏడో భారతీయ సమ్మేళనం ఈ రోజు అంటే..శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ సమ్మేళనం నాలుగురోజుల పాటు జరగనుంది. దేశంలోని 1500 మంది ప్రతినిధులతోపాటు 60 మంది వీసీలు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలతోపాటు విద్యార్థులు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా 80 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ సమ్మేళనానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది.

మానవాళి ఆరోగ్యాన్ని హరిస్తున్న అంటువ్యాధులు !

(27 డిసెంబర్ : "అంతర్జాతీయ అంటువ్యాధుల సంసిద్ధత దినం" సందర్భంగా)

కోవిడ్-19 మహా విపత్తు ప్రపంచ మానవాళికి కఠినమైన గుణపాఠం నేర్పింది. చైనాలో బయట పడిన కరోనా వైరస్ గంటల్లో ప్రపంచాన్ని కమ్మేసింది. అంటువ్యాధులకు దేశ సరిహద్దులు తెలియవు. అంతే కాకుండా వయోపరిమితులను సహితం లెక్క చేయవు. పిల్లలను, మహిళలను సహితం వదిలి పెట్టడం లేదు. ఎనిమిది బిలియన్లకు పైగా ప్రపంచ జనాభా ఇంట్లో కూర్చొని జగజగ వణికి పోయింది. కరోనా వైరస్ అంటువ్యాధి లక్షల ప్రాణాలను బలి తీసుకుంది. కరోనా విపత్తు నేర్పిన పాఠాన్ని విశ్లేషించిన ఐరాస 27 డిసెంబర్ 2000 రోజున నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అంటువ్యాధుల కట్టడి, ఆరోగ్య సంరక్షణ పద్ధతులు, వ్యాధి నిర్ధారణ, చికిత్స విధానాలు లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 27 డిసెంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ అంటువ్యాధుల సంసిద్ధత దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఎపిడెమిక్ ప్రిపేర్డ్‌నెస్"ను పాటించారని నిర్ణయించింది. గతంలో కలరా, ఎబోలా, మీసిల్స్, మలేరియా, హెచ్ఐవి-ఎయిడ్స్, పోలియో, క్షయ లాంటి వ్యాధులు ప్రపంచ జనాభాను తీవ్రంగా వణికించాయి. అంటువ్యాధులు, మహమ్మారి మహా విపత్తులు నేడు ప్రపంచాన్ని కుదిపేస్తున్నాయి, రానున్న రోజుల్లో తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయని వింటున్నాం.

సమైక్య సహకారంతోనే అంటువ్యాధుల కట్టడి:

అంటువ్యాధులు ఎగిసి పడినపుడు వాటి కట్టడి మార్గాలు, నిర్ధారణ పద్ధతులు, సమర్థవంతమైన పర్యవేక్షణ, సత్వర వైద్య చికిత్సలు లాంటి అంశాలను అవగాహన పరచడానికి అంతర్జాతీయ అంటువ్యాధుల సణసిద్ధత దినం నిర్వహించడం 2000 తర్వాత ఆనవాయితీగా మారింది. ముసురుకుంటున్న అంటువ్యాధులను కట్టడి చేయడానికి అంతర్జాతీయ సంస్థలు, ప్రజారోగ్య వ్యవస్థలు, పౌర సమాజం, ప్రతి వ్యక్తి సంసిద్ధంగా, సంఘీభావంతో ఉంటూ సమైక్యంగా పోరాడవలసి ఉందని తెలుసుకోవాలి. అంటువ్యాధులు ప్రబలడంతో దేశాల సామాజిక, ఆర్థిక అభివృద్ధులు దీర్ఘకాలికంగా చితికి పోవడం జరుగుతున్నది. అంతర్జాతీయ స్థాయి నుంచి కుటుంబం వరకు అందరూ అంటువ్యాధుల నిర్మూలనకు కృషి చేయాలి. అంటువ్యాధుల జననం, విస్తరించడం, తీవ్ర ప్రభావాలను చూపడం బహు ముఖీన కోణంలో అర్థం చేసుకోవాలి. పర్యావరణ విధ్వంసం, జీవవైవిధ్యతకు విఘాతం కలిగించడం, వన్య సాదు జంతువుల సంరక్షణ, వ్యక్తిగత ఆరోగ్యం లాంటివి ఒకదాని మీద మరొకటి ఆధారపడి ఉంటున్నాయి.

విస్తరిస్తున్న జునోటిక్ వ్యాధులు:

మానవులకు సంబంధించిన అంటువ్యాధుల్లో 60 - 75 శాతం వరకు జునోటిక్ (జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు) వ్యాధులుగా గుర్తించారు. అంటువ్యాధుల వ్యాప్తి మనిషి, పర్యావరణం, జంతువుల మధ్య సంబంధాన్ని రుజువు చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్త సహకారం కేంద్రంగా "వన్ హెల్త్ అప్రోచ్" ద్వారా దేశ సరిహద్దులను దాటి సమైక్యంగా వ్యాధికారక సుక్ష్మజీవులపై యుద్ధం ప్రకటించాల్సి ఉన్నది. మానవాళి శ్రేయస్సే లక్ష్యంగా సురక్షిత నీరు, శక్తి వనరులు, ఆహారం, వాతావరణ మార్పులు లాంటి అంశాల్లో బహుముఖీన స్థాయిలో సానుకూల చర్యలు తీసుకోవాలి. పర్యావరణ వ్యవస్థలను విధ్వంసం చేయడం, అక్రమ వన్యప్రాణుల వ్యాపారాలు, సాదు జంతువుల పెంపకాల్లో అవలక్షణాలు, మానవాళి అనాలోచిత జీవన విధానాలు లాంటివి అంటువ్యాధులు రెచ్చిపోవడానికి కారణం అవుతున్నాయి. వాతావరణ ప్రతికూల మార్పులు, జీవవైవిధ్య నష్టాలను కట్టడి చేయడానికి సుస్థిర వ్యవసాయ పద్ధతులు, వన్యప్రాణులతో సంబంధాలు, సాదు జంతువుల సంరక్షణలు, నేల ఎడారీకరణ సమస్యలు, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల్లో ప్రతిబంధకాలు, ఆహార ఉత్పత్తుల వినియోగ అవలక్షణాలు, వ్యాధికారక పరాన్నజీవులు లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సరైన ముందడుగు వేస్తేనే అంటువ్యాధులపై యుద్ధంలో మనిషి విజేత కాగలడని తెలుసుకొని బుద్ధితో బతుకులు కొనసాగిద్దాం.

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా సుపరిపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఈ రోజు న్యూఢిల్లీలోని సిరిఫోర్ట్ ఆడిటోరియంలో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ఉపరాష్ట్రపతి... దార్శనికులు, కవి, అంకితభావం గల ప్రజా సేవకులుగా శ్రీ వాజ్‌పేయి చేసిన సేవలను ప్రముఖంగా ప్రస్తావించారు. శ్రీ వాజ్‌పేయి అసమాన వాక్చాతుర్యం, వినయం, ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత సంక్లిష్టమైన ఎన్నో దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొంటూ దేశాన్ని ముందుకు నడిపించాయన్నారు. ఆయన అందించిన సుపరిపాలన బలమైన, సుసంపన్న భారత్‌కు పునాది వేసిందని ఆయన స్పష్టం చేశారు. శ్రీ వాజ్‌పేయి పాలనా విధానం పారదర్శకత, జవాబుదారీతనం, సమ్మిళితత్వం, సమాజంలోని అన్ని వర్గాలకు సేవ చేయడం అనే సూత్రాలపై ఆధారపడి ఉందని శ్రీ రాధాకృష్ణన్ తెలిపారు.

శ్రీ వాజ్‌పేయి పదవీకాలంలో చేపట్టిన కీలక కార్యక్రమాలనూ ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. శ్రీ వాజ్‌పేయి పాలనా విధానం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ విలువలు, జాతీయ ఏకాభిప్రాయంతో ముడిపడిందని ఆయన స్పష్టం చేశారు.

సుపరిపాలనను సమష్టి బాధ్యతగా అభివర్ణించిన ఉపరాష్ట్రపతి... ప్రభుత్వాలు, నిర్వాహకులు, సంస్థలు, పౌర సమాజం సహా పౌరులంతా పారదర్శకమైన, నైతిక విలువలు గల, జవాబుదారీ పాలనను నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వికసిత్ భారత్-2047 దార్శనికతకు అనుగుణంగా అభివృద్ధి చెందిన, సమ్మిళితమైన, సమర్థమైన దేశాన్ని నిర్మించడం కోసం ఆయన అనుసరించిన ఈ సూత్రాలను కొనసాగించాలని శ్రీ రాధాకృష్ణన్ కోరారు.

ఈ కార్యక్రమంలో సత్యవాది రాజా హరిశ్చంద్ర గురించిన ఒక నాటకాన్నీ ప్రదర్శించారు. ఇది పురాణాల్లోని రాజు హరిశ్చంద్రుడు ఆచరించిన సత్యం, సమగ్రత, నిస్వార్థ సేవ సూత్రాలకు ప్రతీకగా శ్రీ వాజ్‌పేయి జీవితాన్ని అనుసంధానిస్తుంది.

ఈ కార్యక్రమాన్ని గాంధీ స్మృతి - దర్శన్ సమితి, హెరిటేజ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ హర్ష్ మల్హోత్రా... ఢిల్లీ శాసనసభ స్పీకర్ శ్రీ విజేందర్ గుప్తా... గాంధీ స్మృతి-దర్శన్ సమితి వైస్ చైర్మన్ శ్రీ విజయ్ గోయెల్... ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

లక్నోలో 'రాష్ట్ర ప్రేరణ స్థల్' ప్రారంభోత్సవ విశేషాలను పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ జీవితం, ఆదర్శాలను గౌరవిస్తూ ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్మించిన 'రాష్ట్ర ప్రేరణ స్థల్' ప్రారంభోత్సవ విశేషాలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పంచుకున్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ 101వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నేడు లక్నో ఒక కొత్త స్ఫూర్తికి సాక్షిగా మారుతోందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. డిసెంబర్ 25న దేశంలోని ఇద్దరు గొప్ప వ్యక్తుల జయంతి వేడుకలు ఉన్నాయని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయీ, భారతరత్న మహామన మదన్ మోహన్ మాలవీయ దేశ గుర్తింపు, ఐకత్య, ప్రతిష్ఠను కాపాడటానికి జీవితాలను అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అపారమైన కృషి ద్వారా ఈ ఇద్దరు మహనీయులు దేశ నిర్మాణంలో చెరగని ముద్ర వేశారని ప్రధాని అన్నారు.

ఆధునిక విద్యను అభ్యసించడంలో యువతకు స్ఫూర్తినిచ్చిన మాలవ్య జీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:బనారస్ హిందూ విశ్వవిద్యాలయ స్థాపకులు, గొప్ప సామాజిక సంస్కర్త, భారతరత్న మహామన పండిట్ మదన్ మోహన్ మాలవ్య జయంతి సందర్భంగా కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ఆయనకు నివాళులర్పించారు.

'ఎక్స్' వేదికగా చేసిన ఒక పోస్టులో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు..

విద్యను సామాజిక సంస్కరణల ప్రాథమిక సూత్రంగా పరిగణించి, బనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ద్వారా భారతీయ సాంస్కృతిక విలువల ఆధారంగా ఆధునిక విద్యను అభ్యసించడానికి మాలవ్య జీ యువతకు స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. జాతి నిర్మాణానికి పత్రికా రంగాన్ని ఒక మాధ్యమంగా మార్చడంలో మహామన గణనీయమైన కృషి చేశారని ఆయన తెలిపారు. అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం జీవితాంతం కృషి చేసిన మహామన నిబద్ధత, ఆయన చేపట్టిన రైతు అనుకూల కార్యక్రమాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని శ్రీ షా పేర్కొన్నారు.

రాజకీయ ప్రత్యామ్నాయాన్ని బీజేపీ స్థాపనతో భారత రాజకీయాలకు అందించిన అటల్ జీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:మాజీ ప్రధానమంత్రి, బీజేపీ వ్యవస్థాపకులు, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా దేశం తరపున కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఘన నివాళులు అర్పించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు. బీజేపీ స్థాపన ద్వారా జాతీయ ప్రయోజనాలకు, సాంస్కృతిక జాతీయవాదానికి ప్రాధాన్యతనిచ్చే రాజకీయ ప్రత్యామ్నాయాన్ని భారత రాజకీయాలకు అటల్ జీ అందించారని పేర్కొన్నారు. భారత్‌ను అణుశక్తి దేశంగా తీర్చిదిద్దటమే కాక, సుపరిపాలనను సాకారం చేయటంలో ఆయన నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశానికి అద్భుతమైన పాలనా నమూనాను అందించిందన్నారు. అది వారసత్వంతో పాటు విజ్ఞాన శాస్త్రాన్ని ముందుకు తీసుకెళ్లిందని చెప్పారు. ప్రజాసేవ పట్ల అంకితభావం, అజేయమైన సంస్థాగత శక్తికి మారుపేరుగా నిలిచిన అటల్ జీ.. భారత రాజకీయాల్లో ఒక శక్తిమంతమైన, చిరస్మరణీయ వ్యక్తి అని శ్రీ అమిత్ షా కొనియాడారు.

నోరు జారితే కఠిన చర్యలే

-ఇక సెటిల్మెంట్లు కుదరవు
-బెదరిస్తే ఊరుకోం
-తిరుపతిలో సీఎం చంద్రబాబు

తిరుపతి, డిసెంబర్ 26:ప్రజాస్వామ్యంలో రాజకీయం పేరుతో రౌడీయిజం చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోం. రౌడీయిజంతో పెద్ద నాయకుడు అవుతారని

భావిస్తే ఎలా. తమ ఇంట్లో పెద్ద నాయకుడు కావచ్చేమో గానీ.. బయటకాదు, బజారులోకి వచ్చి నోరు పారేసుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం, అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరోక్షంగా వైసీపీ నాయకులను హెచ్చరించారు. తిరుపతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం సీఎం ప్రారంభించారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, తిరుపతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయం అద్భుతంగా నిర్మించారు. పరిసరాలు అందర్నీ ఆకట్టుకునేలా ఆహ్లాదంగా ఉన్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రం తిరుపతి, కలియుగ వైకుంఠంగా పిలిచే తిరుమలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు పూర్తి రక్షణ కల్పించాలి. ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలో సెక్యూరిటీ, సేఫ్టీ భావన ప్రజల్లో, భక్తుల్లో రావాలి. అప్పుడే పోలీసుల సేవల పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుంది, అని సీఎం అన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు కృషి చేస్తున్న తిరుపతి పోలీసులకు సీఎం అభినందనలు తెలిపారు. పీడీ యాక్టు పెట్టి సస్పెక్ట్ షీట్లు తెరిచి నిఘా పెట్టారు. ఎర్రచందనం స్మగ్లింగ్ ను సమర్థంగా అరికడుతున్నారు. సమాజ హితం లేని, రాజ్యాంగ పరంగా లేని, చట్టవిరుద్ధ చర్యలు ఎప్పుడూ ఆమోదయోగ్యం కావు, అక్రమాలకు పాల్పడితే టీడీపీ వారైనా కేసులు పెట్టి జైళ్లకు పంపించాం, అని సీఎం చంద్రబాబు వివరించారు. రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణ అని ప్రకటించాం. సెటిల్మెంట్లు, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం, అని సీఎం హెచ్చరించారు. 2019 .. -24 మధ్య పాలకులు శాంతిభద్రతలు భ్రష్టు పట్టించారు. తిరుమల తిరుపతిలో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించారు. మేం అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా శాంతిభద్రతల్ని ఎప్పుడూ చేతుల్లోకి తీసుకోలేదు. హత్యారాజకీయాలను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు వస్తాయి, అని సీఎం వివరించారు.

గత పాలకులు ఇష్టానుసారంగా చేసిన వ్యవహారాలతో ప్రజల్లోనూ రాష్ట్రంలోనూ ఇబ్బందులు తలెత్తాయి. కొందరు ఇప్పటికీ అదే రౌడీయిజాన్ని కొనసాగించాలని ప్రయత్నిస్తున్నారు. రోడ్లు బ్లాక్ చేయటం, రప్పా రప్పా లాడించటం ఏమిటో ఎవరికీ అర్థం కావటం లేదు. పోస్టర్ల వద్ద కత్తులతో జంతు బలి చేసి ఫ్లెక్సీలపై రక్తం చల్లి సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేస్తారా.. అని సీఎం ప్రశ్నించారు.

వివేకా హత్యకేసులో నేరం చేసిన వ్యక్తులు దానిని ఇతరుల పైకి వేసేందుకు ప్రయత్నించారు, నేరస్తులు ఎన్ని డ్రామాలు ఆడినా ఎక్కడో ఓ చోట దొరికిపోతారు. నేరస్తుల కంటే పోలీసులు తెలివిగా వ్యవహరించాలి అని సీఎం ఆదేశించారు.

బంగారు పాళ్యంలో మామిడి కాయలు తొక్కించారు. గుంటూరులో ఓ వ్యక్తిని కాన్వాయ్ కింద తొక్కించేసి పొదల్లో పారేసి పోయారు. అంబులెన్సులో తీసుకెళ్లి చంపేశారని బంధువులతో చెప్పించారు. ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోం. సామాజిక మాధ్యమాలలో ఇంకా అసభ్య పోస్టులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. రాజకీయ ముసుగులో ఉండి నేరాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోం, చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. ఎన్డీఏ భాగస్వామ్యం లో ఉన్న వారెవరూ ఈ తరహా లో వ్యవహరించటం లేదు.

కావాల్సింది పదవులు కాదు..

హైదరాబాద్, డిసెంబర్ 26: తమకు ఇండస్ట్రీలో బతుకు కావాలని, పదవులు కాదని నిర్మాత ప్రసన్న కుమార్ అన్నారు. ఫిల్మ్ చాంబర్ ఎన్నికల్లో తీవ్ర పోటీ నెలకొంది. బడా నిర్మాతలు వర్సెస్ చోటా నిర్మాతలు మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఈ సందర్భంగా నిర్మాత ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. చిన్న నిర్మాతలకు కూడా థియేటర్లు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీ మొత్తం ఒక్కరి చేతుల్లో ఉందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు వక్రీకరిస్తున్నారని అన్నారు. బెన్ ఫిట్ షోలు చిన్న సినిమాలకు కూడా ఇవ్వాలన్నారు.

పెద్ద నిర్మాతలు లేబర్ కమిషనర్ వద్దకు వెళ్లడం దారుణమని, చిన్న నిర్మాతలం సొంత డబ్బుతో నామినేషన్ వేశామని అన్నారు. గతంలో ఒకసారి అవకాశం ఇచ్చినా వాళ్లు ఏం చేయలేదని, మెడిక్లెయిమ్ చేయిస్తామని అది కూడా చేయలేదని చెప్పారు. తమ సమస్యలు పరిష్కరిస్తే ఎన్నికల నుంచి విత్ డ్రా చేసుకుంటామని చెప్పారు.

సుబ్బరాయ సాగర్ కి నీటిని విడుదల చేయాలి

-కలెక్టర్ ను కోరిన మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి

అనంతపురం,డిసెంబర్ 26:: పుట్లూరు మండలంలోని సుబ్బరాయ సాగర్ కి నీటిని విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ను తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి కోరారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండల రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కు జేసీ ప్రభాకర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? గత రెండు నెలల కిందట సుబ్బరాయ సాగర్ లో 11.4 మీటర్ల నీరు ఉంది.. గేట్లు తెరుచుకోకపోవడం తమ దురదృష్టమన్నారు. అందువల్ల నీరు మొత్తం 29వ డిస్ట్రిబ్యూటర్ దగ్గర నుంచి బొప్పేపల్లి చెరువుకు మళ్ళించడం జరిగిందన్నారు. అయితే, పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులను నీటితో నింపలేక పోయారని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు ఈ గేట్లకు మరమ్మత్తులు చేయించడం జరిగిందన్నారు.

ఇప్పుడు పెనకచర్ల డ్యామ్ నుంచి సుబ్బరాయ సాగర్ కు నీటిని రిలీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ని కోరామన్నారు.. నీరు ఇవ్వకపోతే పుట్లూరు మండలంలోని రైతులు నష్టపోతారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ సానుకూలంగా స్పందించారు.. ఒక రైతుగా జిల్లా కలెక్టర్ ని కలిశాను.. దయచేసి దీన్ని రాజకీయం చేయొద్దండిని జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు.

డిసెంబర్ 27, 28వ తేదీల్లో ప్రధానమంత్రి అధ్యక్షతన ఢిల్లీలో ఐదో ప్రధాన కార్యదర్శుల జాతీయ సదస్సు

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:డిసెంబర్ 27, 28వ తేదీల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో అయిదో ప్రధాన కార్యదర్శుల జాతీయ సదస్సు జరగనుంది. జాతీయ అభివృద్ధి ప్రాధాన్యతలపై వ్యవస్థీకృత, నిరంతర చర్చల ద్వారా కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఈ సదస్సు కీలక ఘట్టంగా నిలవనుంది.

ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా సహకార సమాఖ్య స్ఫూర్తితో సాగుతున్న ఈ సదస్సు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేసే వేదికగా నిలుస్తుంది. భారతదేశ మానవ వనరుల సామర్థ్యాన్ని వెలికితీసేందుకు, అందరికీ ప్రయోజనాలు అందేలా భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన వృద్ధిని వేగవంతం చేసేందుకు ఈ సదస్సు ఒక ఉమ్మడి ప్రణాళికను రూపొందిస్తుంది.

ఒక ఉమ్మడి అభివృద్ధి అజెండాను ఖరారు చేసే లక్ష్యంతో డిసెంబర్ 26 నుంచి 28, 2025 వరకు మూడు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతుంది. భారత జనాభాను కేవలం సంఖ్యాపరంగా మాత్రమే చూడకుండా పౌరులను మానవ వనరులుగా తీర్చిదిద్దటానికి ఈ సదస్సు కీలకంగా నిలుస్తుంది. ఇందులో భాగంగా విద్యా వ్యవస్థలను బలోపేతం చేయటం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లటం, దేశవ్యాప్తంగా భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా ఉపాధి అవకాశాలను కల్పించటం వంటి అంశాలపై సమగ్ర వ్యూహాలను రూపొందిస్తారు.

కేంద్ర మంత్రిత్వ శాఖలు, నీతి ఆయోగ్, రాష్ట్రాలు, యూటీలు, పలు రంగాల నిపుణుల మధ్య జరిగిన విస్తృత చర్చల ఆధారంగా అయిదో జాతీయ సదస్సు 'వికసిత్ భారత్ కోసం మానవ వనరులు' అనే ఇతివృత్తంపై దృష్టి సారించనుంది. ఇందులో రాష్ట్రాలు, యూటీలు అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులు, వ్యూహాలను పొందుపరుస్తారు.

ఈ ప్రధాన ఇతివృత్తం ద్వారా సుదీర్ఘ చర్చలకు గుర్తించిన అయిదు కీలక రంగాలు: బాల్య విద్య, పాఠశాల విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య, క్రీడలు, ఇతర కార్యక్రమాలు.

అవకాశాలిస్తే అద్భుతాలే..

కర్నూలు డిసెంబర్ 26: బాలలకు సరైన అవకాశాలు కల్పిస్తే వారు అసాధారణ ప్రతిభను ప్రదర్శించి అద్భుతాలు సృష్టించగలరని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన వీర్ బాల్ దివస్ - 2025 కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు వీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తైన బాలలలో ధైర్యం, త్యాగం, దేశభక్తి విలువలను నాటడమే వీర్ బాల్ దివస్ ఉద్దేశమని పేర్కొన్నారు. సిక్కుల పదవ గురువు గురు గోవింద్ సింగ్ కుమారులు 9 ఏళ్ల జోరావర్ సింగ్, 5 ఏళ్ల ఫతేసింగ్‌లు దేశ గౌరవం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగాన్ని స్మరించుకునే రోజుగా 2022 నుంచి ప్రతి ఏడాది డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా వీర్ బాల్ పురస్కారం అందుకున్న వారిలో కర్నూలు జిల్లా మద్దికెర మండలానికి చెందిన పారా అథ్లెట్ హెచ్‌యూ. శివాని ఉండటం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ అభినందించారు. ఆమె సాధించిన విజయాలు జిల్లాలోని బాలబాలికలకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. బాలలకు అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు సృష్టించగలరని మరోసారి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణారెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జుబేదాబేగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. భాస్కర్, బాలల పరిశీలన గృహాల సూపరింటెండెంట్ తదితర అధికారులు పాల్గొన్నారు. "అవకాశాలిస్తే అద్భుతాలు సృష్టించగలరు" అన్న సందేశాన్ని బాలలందరిలో నాటడమే వీర్ బాల్ దివస్ స్ఫూర్తి అని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి..

-విజయవాడ ట్రాఫిక్ అధికారులకు డీసీపీ దిశానిర్దేశం

విజయవాడ డిసెంబర్ 26:: విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు, నగర ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టారు. కొండ దిగువ ప్రాంతం నుంచి రథం వరకు భక్తుల వాహనాలు, ప్రజా రవాణా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, దిశానిర్దేశక గుర్తులను ఏర్పాటు చేశారు. వీటిని డీసీపీ స్వయంగా పరిశీలించారు.

ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. భక్తుల భద్రతతో పాటు వాహనదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మార్గాలను నియంత్రించాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వంశీధర్ గౌడ్, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఉమామహేశ్వరరావు, కిషోర్ బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొని విధులను సమర్థవంతంగా నిర్వహించారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రేట్లలో మార్పులు

కర్నూలు డిసెంబర్ 26: ఈజాతీయ వ్యవసాయ మార్కెట్ (ఈనామ్) ఆధ్వర్యంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో గురువారం నిర్వహించిన వేలంలో ప్రధాన పంటల ధరలు గణనీయంగా మార్పులు చూపాయి. కొన్ని పంటలకు ఆశాజనక ధరలు లభించగా, మరికొన్నింటికి ఆశించిన స్థాయిలో ధరలు రాక రైతుల్లో ఆందోళన నెలకొంది.

మిర్చి మార్కెట్‌లో ఊపు

ఈ రోజు మార్కెట్‌లో మిర్చి రకాలే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. తేజా మిర్చి క్వింటాలుకు గరిష్టంగా రూ.14,709, సగటు ధర రూ.14,109 పలికింది. తాలు మిర్చి గరిష్టంగా రూ.11,801 చేరింది. దేవనూరు డీలక్స్ మిర్చికి అత్యధికంగా రూ.16,309 ధర లభించగా, సూపర్?10 మిర్చి కూడా గరిష్టంగా రూ.14,581 వరకు విక్రయమైంది. మిర్చి దిగుబడులు తగ్గడం, నిల్వలు పరిమితంగా ఉండటంతో ధరలు బలపడినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

కందులు గరిష్ట ధర రూ.7,200, సగటు ధర రూ.6, 970 గా నమోదైంది. వడకల కందులు గరిష్టంగా రూ.5,284 ధర పలికాయి. దక్షిణాది మార్కెట్లలో డిమాండ్ పెరగడంతో కందులకు మంచి మద్దతు లభించినట్లు తెలుస్తోంది. వేరుశనగ, ఆముదం ధరలు స్థిరంగా వేరు శనగలు గరిష్టంగా రూ.8, 016, ఆముదాలు గరిష్టంగా రూ.6,089 ఈ పంటలకు మధ్యస్థ స్థాయి లావాదేవీలు జరిగాయి.

ఉల్లి ధరలకు ఊరట

ఉల్లి గడ్డలు గరిష్టంగా రూ.2,026, సగటు ధర రూ.1,465గా నమోదయ్యాయి. అయితే రవాణా ఖర్చులు పెరగడంతో రైతులకు పూర్తి లాభం అందలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కర్నూలు మార్కెట్‌లో మిర్చి, కందులు రైతులకు లాభదాయకంగా కావడం విశేషం. వప్పుధాన్యాలు మితమైన స్పందన కనిపించింది.

ధాన్య పంటల్లో ఆశించిన ఉత్సాహం లేని పరిస్థితి. ప్రభుత్వం మద్దతు ధరలపై స్పష్టత ఇవ్వకపోవడం, మధ్యవర్తుల ఆధిపత్యం కొనసాగడం వల్ల రైతులు ఇంకా పూర్తి లాభాలు పొందలేకపోతున్నారని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. రాబోయే రోజుల్లో కొనుగోళ్ల వేగం పెరిగితే ధరలు మరింత మెరుగయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జాతీయ స్థాయిలో 'వీర బాల దివాస్'ను నిర్వహించనున్న కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ.. రేపు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:భారత యువ వీరుల ధైర్యాన్ని, త్యాగాన్ని, ఆదర్శ ప్రాయమైన విలువలను స్మరించుకుంటూ, రేపు (26 డిసెంబర్ 2025) జాతీయ స్థాయిలో 'వీర బాల దివాస్'ను భారత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. అదే రోజున, వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (పీఎంఆర్‌బీపీ) అవార్డులను ప్రదానం చేయనుంది.

సాహసం, కళలు, సంస్కృతి, పర్యావరణం, సామాజిక సేవ, సైన్స్, సాంకేతికత, క్రీడల వంటి రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలకు ఏటా భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులను అందిస్తుంది. 2025 సంవత్సరానికి గానూ, దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 20 మంది బాలలు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 26 డిసెంబర్ 2025న ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను అందిస్తారు.

వీర బాల దివాస్-2025 జాతీయ స్థాయి కార్యక్రమం న్యూఢిల్లీలోని భారత మండపంలో 26 డిసెంబర్ 2025న జరగనుంది. భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ వేడుకకు హాజరై, దేశంలోని పిల్లలు, యువతను ఉద్దేశించి ప్రసంగిస్తూ, దేశ నిర్మాణంలో యువత పోషించాల్సిన కీలక పాత్రను స్పష్టం చేస్తారు. పిల్లలు, యువతలో స్ఫూర్తిని కలిగించేలా ధైర్యం, పట్టుదల, నిస్వార్థ సేవలకు సంబంధించిన కథనాలను ఈ కార్యక్రమం ప్రదర్శించటం ద్వారా వికసిత్ భారత్‌ఏ 2047 లక్ష్యానికి అనుగుణంగా సమర్థులైన, బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దడంలో భారత ప్రభుత్వ ప్రాధాన్యత స్పష్టమవుతుంది. మహిళా, శిశు అభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి శ్రీమతి అన్నపూర్ణ దేవి స్వాగత ప్రసంగం ఇస్తారు. దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులు, పీఎంఆర్‌బీపీ అవార్డు గ్రహీతలు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. భారతదేశ గొప్ప నాగరికత వారసత్వాన్ని, శౌర్య పరాక్రమాలను ప్రతిబింబించేలా నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలు ఈ వేడుకలో ప్రధాన ఆవీర బాల్ దివాస్-2025 జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ఎన్ఐసీ వెబ్‌కాస్ట్, డీడీ న్యూస్, మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో 26 డిసెంబర్ 2025న మధ్యాహ్నం 12:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు, డిసెంబర్ 26: కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐఎల్ఏ - 2026ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమం జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులు, సంఘ ప్రతినిధుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాదులు మాట్లాడుతూ, ఐఎల్ఏ క్యాలెండర్-2026 కర్నూల్ జిల్లా బార్ అసోసియన్ అనే శీర్షికతో రూపొందించిన ఈ క్యాలెండర్ న్యాయవృత్తికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. న్యాయవాదుల సేవలు, న్యాయవ్యవస్థ ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేసే విధంగా క్యాలెండర్‌ను రూపొందించారని అభినందించారు.

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 'జాతీయ స్ఫూర్తి ప్రదాన ప్రాంగణాన్ని' ప్రారంభించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:మాజీ ప్రధాని అటల్ బిహారీ శ్రీ వాజ్‌పేయి 101వ జయంతి నేపథ్యంలో ఆయన జీవితం, ఆదరశాల గౌరవపూర్వక సంస్మరణ దిశగా ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్మించిన 'జాతీయ స్ఫూర్తి ప్రదాన ప్రాంగణాన్ని (రాష్ట్ర ప్రేరణా స్థల్)ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- లక్నో నగరం ఇవాళ ఓ నవ్య స్ఫూర్తికి సాక్షిగా నిలిచిందని వ్యాఖ్యానించారు. అలాగే, దేశ ప్రజలతోపాటు యావత్ ప్రపంచంలోని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో లక్షలాది కుటుంబాలు నేడు ఘనంగా వేడుకలు నిర్వహించుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ క్రిస్మస్ వేడుక ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం నింపాలన్నదే ప్రజానీకం సమష్టి ఆకాంక్షగా ఆయన పేర్కొన్నారు.

భరతమాత విశిష్ట పుత్రులలో ఇద్దరి జయంతి ఏటా డిసెంబరు 25వ తేదీన వస్తుందని ప్రధాన మంత్రి గుర్తుచేశారు. ఈ మేరకు మేరునగ సమానులైన భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి, భారతరత్న-మహామన శ్రీ మదన్ మోహన్ మాలవీయ?. దేశం గుర్తింపు, ఐక్యత, గౌరవాల పరిరక్షణలో తమ జీవితాలను అంకితం చేశారని శ్రీ మోదీ కొనియాడారు. ఈ మహనీయులిద్దరూ తమ అసమాన సేవలతో దేశ ప్రగతిపై చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు.

మహారాజా బిజ్లీ పాసి జయంతి కూడా ఇదే డిసెంబర్ 25వ తేదీన వస్తుందని, ఈ ప్రసిద్ధ కోట కార్యక్రమ ప్రాంగణానికి సమీపంలోనే ఉందని గుర్తుచేశారు. సుపరిపాలన, శౌర్యపరాక్రమాలు, సార్వజనీనత సహిత వారసత్వాన్ని మహారాజా బిజ్లీ పాసి మనకు ఇచ్చి వెళ్లారని పేర్కొన్నారు. ఆయన వారసత్వాన్ని పాసి సమాజం నగర్వంగా కొనసాగిస్తున్నదని ప్రశంసించారు. మహారాజా గౌరవార్థం 2000 సంవత్సరంలో అటల్ జీ ప్రత్యేక తపాలా బిళ్లను ఆవిష్కరించడాన్ని ఒక యాదృచ్ఛిక సంఘటనగా అభివర్ణించారు. ఈ సందర్భంగా మహామన మాలవీయ, శ్రీ వాజ్‌పేయిలతోపాటు మహారాజాకు కూడా ఆయన సగౌరవ నివాళి అర్పించారు.

భారతదేశానికి ఆత్మగౌరవం, ఐక్యత, సేవా మార్గం చూపిన మహనీయుల దార్శనికతకు ప్రతీకగా కాసేపటి కిందటే 'రాష్ట్ర ప్రేరణా స్థల్'ను ప్రారంభించే అదృష్టం తనకు లభించిందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఈ ప్రాంగణంలో డాక్టర్ శ్రీ శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ శ్రీ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్, శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయిల భారీ విగ్రహాలు సగర్వంగా నిలిచాయన్నారు. దేశ ప్రజానీకానికి వారందించే స్ఫూర్తిని మించినది మరేదీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శ్రీ అటల్ వ్యాఖ్యాలను ఉటంకిస్తూ- ఈ ప్రాంగణం మన ప్రతి అడుగు, ప్రతి ప్రయత్నం దేశ పురోగమనానికి అంకితం కావాలనే సందేశాన్నిస్తుందని చెప్పారు. సమష్టి కృషితోనే వికసిత భారత్ స్వప్నం సాకారం కాగలదని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఈ ఆధునిక స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు కావడంపై లక్నోనగర వాసులతోనే కాకుండా ఉత్తరప్రదేశ్ సహా యావద్దేశానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ ప్రాంగణం నిర్మించిన ప్రదేశంలో 30 ఎకరాలకు పైగా భూమి దశాబ్దాల పాటు చెత్త పర్వతం పేరుకుపోయిందని పేర్కొన్నారు. దీన్నంతటినీ గడచిన మూడేళ్లలో పూర్తిగా తొలగించారని ఆయన తెలిపారు. తద్వారా ఈ ప్రాజెక్టు సాకారం కావడానికి దోహదం చేసిన కార్మికులు, కళాకారులు, ప్రణాళిక రూపకర్తలందరికీ ప్రధానమంత్రి అభినందనలు తెలుపుతూ వారి కృషి అపారమని చెప్పారు. అలాగే ముఖ్యమంత్రికి, ఆయన బృందానికి కూడా ప్రత్యేక ప్రశంసలు తెలిపారు.

దేశానికి దిశానిర్దేశంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ నిర్ణయాత్మక పాత్ర పోషించారని చెప్పారు. భారత్‌లో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానమంత్రుల నిబంధనను తిరస్కరించింది ఆయనేనని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా జమ్మూకాశ్మీర్ విషయంలో ఈ ఏర్పాటు దేశ సమగ్రతకు గొడ్డలిపెట్టుగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే, అందుకు కారణమైన ఆర్టికల్ 370 అడ్డుగోడను కూల్చే అవకాశం తమ ప్రభుత్వానికే లభించిందన్నారు. అందుకే, ఇవాళ జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగం పూర్తి స్థాయిలో అమలవుతున్నదని శ్రీ మోదీ సగర్వంగా ప్రకటించారు.

స్వతంత్ర భారత తొలి పరిశ్రమల శాఖ మంత్రిగా దేశ ఆర్థిక స్వావలంబనకు డాక్టర్ ముఖర్జీ పునాది వేశారని ప్రధానమంత్రి చెప్పారు. తొలి పారిశ్రామిక విధానంతో దేశంలో పారిశ్రామికీకరణకు పునాది వేశారని గుర్తుచేశారు. ఆయన బాటలో, అదే స్వావలంబన మంత్రంతో దేశాన్ని నేడు సమున్నత శిఖరాలకు చేరుస్తున్నామని తెలిపారు. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుండటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌నే ఉదాహరణగా స్వీకరిస్తే- 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' పేరిట భారీ కార్యక్రమం అమలవుతోందని, తద్వారా చిన్న పరిశ్రమలు, చిన్న యూనిట్లు బలోపేతం అవుతున్నాయని శ్రీ మోదీ అన్నారు. మరోవైపు ఈ రాష్ట్రంలో ఒక భారీ రక్షణ కారిడార్ నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచానికి మన శక్తిసామర్థ్యాలు చాటిన బ్రహ్మోస్ క్షిపణి లక్నోలోనే తయారవుతోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో ఉత్తరప్రదేశ్ రక్షణ కారిడార్ అంతర్జాతీయ గుర్తింపు పొందే రోజు ఎంతో దూరంలో లేదన్నారు.

పండిట్ శ్రీ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ దశాబ్దాల కిందట కలలగన్న 'అంత్యోదయ' సూత్రాన్ని ఉటంకిస్తూ- వరుసలో నిలుచునే చివరి వ్యక్తి ముఖంలోనూ చిరునవ్వునే దేశ ప్రగతికి కొలబద్దగా ఆయన పరిగణించారని గుర్తుచేశారు. ఆయన ప్రబోధించిన సమగ్ర మానవతావాదం మన శరీరం, మనస్సు, బుద్ధి, ఆత్మ.. అన్నిటినీ వికసింపజేస్తుందని స్పష్టం చేశారు. దీన్‌దయాళ్ స్వప్నాన్ని తన సొంత సంకల్పంగా స్వీకరించిన నేపథ్యంలో 'అంత్యోదయ'కు సంతృప్త స్థాయి పేరిట సరికొత్త దృక్కోణాన్ని జోడించామని చెప్పారు. తద్వారా ప్రతి నిరుపేదను, అర్హుడైన ప్రతి లబ్ధిదారును ప్రభుత్వ సంక్షేమ పథకాల పరిధిలోకి తెస్తున్నామని శ్రీ మోదీ పేర్కొన్నారు. సంతృప్తత స్ఫూర్తితో కృషి చేస్తే వివక్ష తావుండదని, నిజమైన సుపరిపాలన, వాస్తవిక సామాజిక న్యాయం, అసలుసలు లౌకికవాదం తదితరాలకు ఇదే తార్కాణమని ప్రధానమంత్రి అభివర్ణించారు. ఈ రోజున దేశంలోని లక్షలాది పౌరులు ఎలాంటి వివక్ష లేకుండా తొలిసారి పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు, కొళాయి నీరు, విద్యుత్, గ్యాస్ కనెక్షన్లు తదితరాలన్నిటినీ పొందుతున్నారని ఆయన గుర్తుచేశారు. ఇక లక్షలాది మందికి తొలిసారి ఉచిత రేషన్, ఉచిత వైద్యం సమకూరాయని తెలిపారు. వరుసలో నిలిచిన చిట్టచివరి వ్యక్తికీ చేరువయ్యేందుకు కృషి చేస్తేనే పండిట్ దీన్‌దయాళ్ ఆశయానికి న్యాయం చేసినట్లు కాగలదని పునరుద్ఘాటించారు.

దేశవ్యాప్తంగా గత దశాబ్దంలో కోట్లాది ప్రజలు పేదరిక విముక్తులయ్యారని శ్రీ మోదీ చెప్పారు. సమాజంలో వెనుకబడిన, చివరి వరుసలోగల వారికి తమ ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. దేశంలో 2014కు ముందు సామాజిక భద్రత పథకాల పరిధిలోగల ప్రజల సంఖ్య సుమారు 25 కోట్లు కాగా, నేడు దాదాపు 95 కోట్ల మంది ప్రజల జీవితాలకు ఈ రక్షణ కవచం భరోసా ఇస్తున్నదని తెలిపారు. ఈ లబ్ధిదారులలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రవాసులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు బ్యాంకు ఖాతాలే కాకుండా జీవిత బీమా రక్షణ కూడా సంపన్నులైన కొద్దిమందికే పరిమితమై ఉండేదని ప్రధానమంత్రి ఉదాహరించారు. అయితే, చిట్టచివరి పంక్తిలో ఉన్న వ్యక్తికీ బీమా రక్షణ కల్పించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకున్నదని ఆయన ఉద్ఘాటించారు. ఈ మేరకు నామమాత్రపు రుసుముతో రూ.2 లక్షల బీమా సదుపాయం కల్పిస్తూ 'ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన'ను ప్రారంభించామని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా 25 కోట్లకుపైగా పేదలు ఈ పథకం కింద రక్షణ పొందుతున్నారని ఆయన తెలిపారు. అలాగే ప్రమాద బీమా దిశగా 'ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన' కింద దాదాపు 55 కోట్ల మంది పేదలకు భద్రత లభించిందని చెప్పారు. గతంలో బీమా గురించి కలలోనైనా ఆలోచించలేని వారికీ నేడు సామాజిక భద్రత లభిస్తున్నదని వివరించారు. ఈ పథకాల కింద ఇప్పటికే దాదాపు రూ.25వేల కోట్ల విలువైన లబ్ధిదారుల క్లెయిమ్‌లు పరిష్కరించడం గురించి తెలిస్తే చాలామంది ఆశ్చర్యపోతారని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. సంక్షోభ సమయాల్లో ఈ సొమ్ము పేద కుటుంబాలకు అండగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

అటల్ జీ జయంతి సుపరిపాలనను జరుపుకునే రోజు కూడా అని ప్రధానమంత్రి అన్నారు. చాలా కాలం పాటు పేదరిక నిర్మూలన వంటి నినాదాలనే పాలనగా పరిగణించారని, అయితే అటల్ జీ నిజంగా సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువచ్చారని ఆయన అన్నారు. ఈ రోజు డిజిటల్ గుర్తింపుపై విస్తృతంగా చర్చ జరుగుతున్నప్పటికీ, దానికి పునాదులు వేసింది అటల్ జీ ప్రభుత్వమేనని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఆ సమయంలో ప్రారంభించిన ప్రత్యేక కార్డు కార్యక్రమం నేడు ఆధార్‌గా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో టెలికాం విప్లవాన్ని వేగవంతం చేసిన ఘనత కూడా అటల్ జీకే దక్కుతుందని ప్రధానమంత్రి తెలిపారు. ఆయన ప్రభుత్వం రూపొందించిన టెలికాం విధానం ప్రతి ఇంటికి ఫోన్లు, ఇంటర్నెట్‌ను సులభంగా చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించిందని, ఫలితంగా నేడు ప్రపంచంలోనే అత్యధిక మొబైల్, ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్న దేశాలలో భారత్ ఒకటిగా నిలిచిందని ఆయన తెలిపారు.

గత పదకొండు సంవత్సరాలలో భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద మొబైల్ ఫోన్ల తయారీ దేశంగా ఎదిగిందని ఈ విషయం అటల్ జీకి సంతోషాన్ని కలిగిస్తుందని శ్రీ మోదీ అన్నారు. అటల్ జీ పార్లమెంట్ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతం భారతదేశంలో మొబైల్ తయారీలో మొదటి స్థానంలో ఉందని ఆయన ప్రముఖంగా చెప్పారు.

కనెక్టివిటీపై అటల్ జీ దూరదృష్టి 21వ శతాబ్దపు భారతదేశానికి ప్రారంభ దశలోనే బలాన్ని ఇచ్చిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అటల్ జీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలను రోడ్లతో కలిపే కార్యక్రమం ప్రారంభమైందని, స్వర్ణ చతుర్భుజి రహదారి విస్తరణ పనులు ఆనాడే మొదలయ్యాయని గుర్తు చేశారు. దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అటల్ జీ వేసిన పునాది నేటి ప్రగతికి కారణమని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం కింద 2000 సంవత్సరం నుంచి సుమారు 8 లక్షల కిలోమీటర్ల గ్రామీణ రహదారుల నిర్మాణం జరిగిందని, వీటిలో దాదాపు 4 లక్షల కిలోమీటర్ల రోడ్లను గత 10-11 సంవత్సరాలలో నిర్మించారని చెప్పారు. నేడు దేశవ్యాప్తంగా అపూర్వ వేగంతో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం అసాధారణ వేగంతో జరుగుతోందని, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఎక్స్‌ప్రెస్‌వే రాష్ట్రంగా గుర్తింపు పొందుతోందని ఆయన తెలిపారు. ఢిల్లీ మెట్రోకు కూడా అటల్ జీ శ్రీకారం చుట్టారని ప్రధానమంత్రి ప్రముఖంగా పేర్కొన్నారు. నేడు దేశంలోని 20కి పైగా నగరాలలో మెట్రో నెట్‌వర్క్‌లు లక్షలాది ప్రజల జీవితాలను సులభతరం చేస్తున్నాయని అన్నారు. శ్రీ వాజ్‌పేయి ప్రభుత్వం సృష్టించిన సుపరిపాలన వారసత్వాన్ని కేంద్రం, రాష్ట్రాలలోని తమ ప్రభుత్వాలు ఇప్పుడు మరింత విస్తరించి, కొత్త కోణాలను ఇస్తున్నాయని ఆయన తెలిపారు.

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయిల స్ఫూర్తితో పాటు దూరదృష్టితో కూడిన వారి కృషి, వారి భారీ విగ్రహాలు అభివృద్ధి చెందిన భారతదేశానికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ విగ్రహాలు నేడు దేశమంతటా కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపుతున్నాయని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో జరిగిన ప్రతి మంచి పనిని ఒకే కుటుంబంతో అనుసంధానించే ధోరణి ఎలా ఏర్పడిందో మరచిపోవద్దని ఆయన స్పష్టం చేశారు. ఆ కుటుంబానికి చెందిన వ్యక్తుల కీర్తిని పెంచడానికి వారి పేర్లు, విగ్రహాలతో పుస్తకాలు, ప్రభుత్వ పథకాలు, సంస్థలు, వీధులు లేదా కూడళ్లను అనుసంధానం చేశారని విమర్శించారు. ఇలా ఒకే కుటుంబం చేతిలో బందీ అయిన పాత విధానం నుంచి దేశానికి తమ పార్టీ విముక్తి కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. మాతృభూమి సేవలో అమరులైన ప్రతి ఒక్కరినీ తమ ప్రభుత్వం గౌరవిస్తోందని ప్రధాని తెలిపారు. ఉదాహరణగా, నేడు ఢిల్లీలోని కర్తవ్య పథ్ వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం సగర్వంగా నిలిచి ఉందని, అలాగే అండమాన్‌లో నేతాజీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన దీవికి ఇప్పుడు ఆయన పేరే పెట్టామని పేర్కొన్నారు.


ఆత్మీయుడు
రెండు ఒకట్లు
వి.పి. చందన్‌రావు ✣ కందాళై రాఘవాచార్య
జంట కవుల స్నేహ స్వర్ణోత్సవ కవితా విపంచిక
ఆవిష్కరణ
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ రవీంద్రభారతి సౌజన్యంతో
తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ సంయుక్త నిర్వహణ
ముఖ్య అతిథి :
డా॥ ఏనుగు నరసింహా రెడ్డి
సంచాలకులు
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
ఆవిష్కర్త :
ప్రజాకవి డా॥ నందిని సిధారెడ్డి
పద్మశ్రీ తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు
సభాధ్యక్షులు :
కందుకూరి శ్రీరాములు
అధ్యక్షులు
తెలంగాణ సంఘం జంటనగరాల శాఖ
ఆత్మీయ అతిథులు :
డా॥ నాకే శ్వరం శంకరం ప్రముఖ కవి, తెలంగాణ రచయితల రాష్ట్ర అధ్యక్షులు
అయినంపూడి శ్రీలక్ష్మి కవయిత్రి - ఆకాశవాణి ప్రయోక్త అక్షరయాన్ అధ్యక్షురాలు
బైస దేవదాస్ సంపాదకులు - నేటి నిజం దిన పత్రిక
డా॥ రూప్ కుమార్ డబ్బీకర్ కవి విమర్శకులు
గుడిపాటి సంపాదకులు - పాలపిట్ట మాసపత్రిక
సమన్వయకర్త డా॥ చెల్లంకొండ సంపత్ కుమార్ తెరసం. జంట నగరాల శాఖ కార్యదర్శి
వేదు నక్షత్రం యు.ఎన్.ఎ సౌజన్యంతో
ఇందూరు సాహితి ఆత్మీయ అతిథులు :
డా॥ శారదా హనుమాండ్లు రచయిత్రి - చేలం జానకీ

వంగవీటి.. ఆదర్శ నాయకుడు

గుడివాడ,అమరావతి, డిసెంబర్ 26: బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలబడి.. వారి హక్కుల కోసం నిరంతరం పోరాడిన పేదవర్గాల ఆదర్శనాయకుడు వంగవీటి రంగా అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొనియాడారు. స్వర్గీయ వంగవీటి మోహన రంగా 37వ వర్ధంతిని జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బేతవోలులో జరిగిన వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ నాయకులు పండ్రాజు సాంబయ్య ఆధ్వర్యంలో ఏజీకే స్కూల్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వర్ధంతి కార్యక్రమాల్లో ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూర్రగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి ,చేకూరు జగన్మోహన్రావు బేతవోలులో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో పోలాసి ఉమా, తిరుపతిరావు, సొంటి రామకృష్ణ, పెన్నేరు విశ్వనాథ్, చీకటి సూర్యనారాయణ, ఉక్కుపాటి కుమార్, పల్లెపాట రాజా, యేసు పాదం,లోయ శివాజీ, కొడాలి రామరాజు, అట్లూరి స్వరూప్,సీతయ్య, నిరసి కాశి, గోవాడ శివ,లోయ విజయ్... గుడివాడ జనసేన పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీర్ణక్రియ సమస్యల వరకు కరివేపాకు ఎన్నో రకాలుగా మేలు

హైదరాబాద్, డిసెంబర్ 26:ఆరోగ్యమే మహా భాగ్యం అన్నది పెద్దల మాట. మన వంటగదిలో కనిపించే ఆకుకూరల్లో అద్భుతమైన ఔషధ గుణాలు దాగి ఉన్నాయి. అలాంటి వాటిలో 'కరివేపాకు' అగ్రశ్రేణికి చెందుతుంది. కానీ, మన నిత్య జీవితంలో జీవితంలో ఎవరినైనా తక్కువ చేసి మాట్లాడాలన్నా లేదా ఒకరి ప్రాధాన్యతను తగ్గించాలన్నా ''కూరలో కరివేపాకు'' అనే మాటను ఒక సామెతలా వాడుతుంటాం. అంటే, పని పూర్తయ్యాక విసిరి పక్కన పారేస్తారని..

సాధారణంగా మనం కూరల్లో కూడా కరివేపాకు కనిపిస్తే దానిని తీసి పక్కన పెడుతుంటాం. కానీ, అసలు నిజం ఏంటంటే.. వంటలో కరివేపాకు పడకపోతే రుచి రాదు, గుమగుమ ఉండదు. ఆ చిన్న ఆకులో దాగున్న పోషక విలువలు తెలిస్తే మాత్రం మీరు ఎప్పటికీ ఈ తప్పు ఎప్పటికీ చేయరు. కేవలం రుచి కోసం, సువాసన కోసం మాత్రమే కాకుండా, సంపూర్ణ ఆరోగ్యానికి, ముఖ్యంగా కేశ సౌందర్యానికి కరివేపాకు ఒక వరప్రసాదం అంటే నమ్ముతారా..

అవును, జుట్టు రాలడం నుండి జీర్ణక్రియ సమస్యల వరకు కరివేపాకు ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. ఆయుర్వేదంలో కూడా కరివేపాకుకు విశిష్టమైన స్థానం ఉంది. కరివేపాకులోని పోషక గుణాలు, జుట్టుకు కలిగే ప్రయోజనాలు, దానిని వాడే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం.

వంటల్లో కరివేపాకును కేవలం గార్నిషింగ్ కోసమే కాదు.. ప్రతి వంటలో దీనిని చేర్చడానికి ప్రధాన కారణం దానిలోని జీర్ణక్రియ సామర్థ్యం అని కూడా చెప్పుకోవచ్చు. కరివేపాకులో ఉండే ఎంజైమ్‌లు మనం తిన్న ఆహారం త్వరగా అరగడానికి సహాయపడతాయి. గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలను దరిచేరనీయవు.

కరివేపాకులో విటమిన్ ఎ, బి, సి, ఇ లతో పాటు ఐరన్, కాల్షియం, మెగ్నీషియం వంటి మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. కరివేపాకులోని అమినో యాసిడ్స్ జుట్టు కుదుళ్లను దృఢంగా మార్చి, జుట్టు రాలడాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. నేటి కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య జుట్టు రాలడం. దానికి తోడు చుండ్రు.

అయితే, కరివేపాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు స్కాల్ప్‌పై రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. దీని కారణంగా జుట్టు మూలాలకు కావాల్సిన పోషణ అందుతుంది. అంతేకాకుండా, ఇందులో ఉండే బీటా కెరోటిన్, ప్రొటీన్లు జుట్టు చిట్లిపోకుండా కాపాడతాయి.

ముఖ్యంగా తెల్ల జుట్టు సమస్యతో బాధపడేవారికి కరివేపాకు ఒక సహజమైన మందులా పనిచేస్తుంది. ఇది జుట్టులోని మెలనిన్ ఉత్పత్తిని పెంచి, జుట్టు సహజంగా నల్లబడటానికి సహాయపడుతుంది. మెంతులు, ఉసిరి పొడితో కలిపి కరివేపాకును వాడటం వల్ల జుట్టు మరింత ఒత్తుగా, పొడవుగా పెరుగుతుంది.

అలాగే, నేటి కాలంలో చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ కంటి చూపు సమస్యలు వస్తున్నాయి. కరివేపాకులో ఉండే విటమిన్-ఎ కంటి రెటినాను సంరక్షించడమే కాకుండా, రేచీకటి వంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది.

అలాగే, చక్కెర వ్యాధితో భాద పడే వారికి కరివేపాకుతో ప్రయోజనాలు ఉన్నాయి. రోజూ ఉదయాన్నే కొన్ని పచ్చి కరివేపాకు ఆకులను నమిలితే, రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి గుండె పోటు రాకుండా కాపాడే అద్భుత శక్తి కరివేపాకుకు ఉంది.

మనం తినే ఆహారంలోని టాక్సిన్స్ ని శుద్ధి చేసే కాలేయానికి కరివేపాకు ఒక టానిక్ లా పనిచేస్తుంది. ముఖ్యంగా ఆల్కహాల్ అలవాటు ఉన్నవారికి లేదా అధికంగా మందులు వాడే వారికి కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కరివేపాకులోని కెంఫెరోల్, విటమిన్-ఎ, సి లు కాలేయంపై ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గించి లివర్ హెల్త్‌ను మెరుగుపరుస్తుంది.

చాలామంది మహిళలు రక్తహీనత సమస్యతో బాధపడుతుంటారు. అయితే, కరివేపాకులో ఐరన్, ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచడంలో.. రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా దీనికి సాటిలేదు.

కరివేపాకును వినియోగించే సరైన పద్ధతులు

ప్రతిరోజూ ఉదయం పరగడుపున రెండు లేదా మూడు పచ్చి కరివేపాకు రెబ్బలను బాగా నమిలి తింటే.. శరీరానికి అవసరమైన యాంటీ ఆక్సిడెంట్లు అందుతాయి. కరివేపాకును రెండు రకాలుగా ఉపయోగించవచ్చు. ఒకటి ఆహారంలో భాగంగా తీసుకోవడం, రెండవది నేరుగా జుట్టుకు అప్లై చేయడం.

ఇక జుట్టు సంరక్షణ విషయానికి వస్తే, కరివేపాకుతో తయారుచేసిన హెయిర్ ప్యాక్‌లు అద్భుత ఫలితాలను ఇస్తాయి. కొన్ని కరివేపాకు రెబ్బలను తీసుకుని అందులో నానబెట్టిన మెంతులు, కొద్దిగా ఉసిరి ముక్కలు కలిపి మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుండి చివర్ల వరకు పట్టించి, సుమారు అరగంట సేపు ఆరనివ్వాలి. ఆపై కుంకుడు కాయలు లేదా మైల్డ్ షాంపూతో తలస్నానం చేస్తే జుట్టు రాలడం తగ్గి, మెరుపు వస్తుంది.

అదేవిధంగా, కరివేపాకు నూనె కూడా చాలా ప్రాచుర్యం పొందింది. స్వచ్ఛమైన కొబ్బరి నూనెను వేడి చేసి అందులో గుప్పెడు కరివేపాకులు వేసి అవి నల్లగా మారే వరకు మరిగించాలి. ఈ నూనెను వడకట్టి వారానికి ఒకటి లేదా రెండుసార్లు జుట్టుకు పట్టించి మసాజ్ చేస్తే? జుట్టు మూలాలు దృఢంగా మారి, ఒత్తుగా పెరుగుతాయి.

అయితే, ఏది చేసినా అది లిమిట్ లోనే చేయాలి. ఏదైనా సరే మితిమీరితే ప్రమాదమే అన్నట్లుగా, కరివేపాకు విషయంలోనూ కొన్ని జాగ్రత్తలు పాటించాలి. సాధారణంగా కరివేపాకు వల్ల పెద్దగా సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. కానీ కొందరికి దీనివల్ల అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది.

ముఖ్యంగా పుప్పొడి అలర్జీ లేదా కొన్ని రకాల ఆకుల వాసన పడని వారికి కరివేపాకు వాడటం వల్ల చర్మంపై దద్దుర్లు, దురద వంటి సమస్యలు రావచ్చు. అందుకే మొదటిసారి వాడేవారు ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం ఉత్తమం.

ఇక అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, కరివేపాకు మొక్కకు పూసే పువ్వులు, పండ్లు. కరివేపాకు ఆకులు మాత్రమే తినదగినవి. దాని పువ్వులు కొన్ని సందర్భాల్లో విషపూరితంగా మారే అవకాశం ఉంటుంది. వాటిని పొరపాటున కూడా ఆహారంగా తీసుకోకూడదు.

అలాగే, ఆస్తమా లేదా శ్వాసకోస సంబంధిత సమస్యలు ఉన్నవారు కరివేపాకును అధికంగా వాడకూడదు. ఎందుకంటే ఇందులోని కొన్ని గుణాలు అలర్జీని ప్రేరేపించి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగించే అవకావం ఉటుంది. జుట్టుకు నూనె వాడేటప్పుడు కూడా రోజూ కాకుండా వారానికి రెండు సార్లు మాత్రమే వాడటం మంచిది.

ప్రకృతి ప్రసాదించిన ఈ అద్భుతమైన కరివేపాకును మన నిత్య జీవితంలో భాగంగా చేసుకుంటే ఎన్నో లాభాలు పొందవచ్చు. కేవలం బాహ్య సౌందర్యానికే కాకుండా, లోపలి నుండి ఆరోగ్యాన్ని ఇచ్చే గుణాలు కరివేపాకులో ఉన్నాయి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా చేసే వ్యాయామంతో పాటు ఇలాంటి సహజమైన చిట్కాలను పాటిస్తే మెరిసే జుట్టుతో పాటు దృఢమైన ఆరోగ్యం మీ సొంతం అవుతుంది. అయితే, ఏదైనా దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు లేదా గర్భిణీలు కరివేపాకును ఔషధంగా వాడే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

స్వాతంత్ర్య సమరయోధుడు, అమరుడు ఉధమ్ సింగ్ జయంతి సందర్భంగా నివాళి అర్పించిన కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:స్వాతంత్ర్య సమరయోధుడు, అమర వీరుడు ఉధమ్ సింగ్ జయంతి సందర్భంగా కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆయనకు నివాళి అర్పించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన పోస్టులో.. జలియన్ వాలాబాగ్ ఊచకోతలో అమరులైన దేశ ప్రజల తరపున ప్రతీకారం తీర్చుకోవడంలో అమరవీరుడు ఉధమ్ సింగ్ అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శించారని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. గదర్ ఉద్యమం ద్వారా భారత స్వాతంత్ర్య పోరాట జ్వాలను విదేశాలకు వ్యాపింపజేయడంలోనూ ఉధమ్ సింగ్ కీలక పాత్ర పోషించారన్నారు.

ఆయన వీరగాథ దేశ యువతకు తరగని స్ఫూర్తి అని, మాతృభూమి పట్ల వారిలో భక్తిభావాన్ని నింపుతుందని శ్రీ అమిత్ షా అన్నారు.

శ్రీ బిశ్వ బంధు సేన్ మృతికి ప్రధాని సంతాపం

న్యూఢిల్లీ, డిసెంబర్ 26:త్రిపుర శాసనసభ స్పీకర్ శ్రీ బిశ్వ బంధు సేన్ మృతి పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు.

త్రిపుర పురోగతిని పెంపొందించడానికి, అనేక సామాజిక కార్యక్రమాల పట్ల నిబద్ధతతో చేసిన కృషికి ఆయన చిరస్మరణీయంగా నిలిచిపోతారని శ్రీ మోదీ పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధాని పోస్టు "త్రిపుర అసెంబ్లీ స్పీకర్ శ్రీ బిశ్వ బంధు సేన్ జీ మృతి బాధాకరం.

త్రిపుర పురోగతిని ప్రోత్సహించడానికి, సామాజిక కార్యక్రమాల పట్ల నిబద్ధతతో చేసిన కృషికి ఆయన చిరస్మరణీయంగా నిలిచిపోతారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి."

ప్రజలందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది

మొబైల్, ఇంటర్నెట్ వాడే దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది: ప్రధాని మోడీ

లఖ్ నవూ డిసెంబర్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రపంచం మొత్తం బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం చూసిందని ప్రధాని నరేంద్రమోడీ తెలిపారు. ప్రజలందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని అన్నారు. వాజ్ పేయీ జయంతి సందర్భంగా లఖ్ నవూలో జాతీయ ప్రేరణ స్థల్ ప్రారంభం చేశారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ్, అటల్ బిహారీ వాజ్ పేయీ విగ్రహాలు, విగ్రహాలతో పాటు మ్యూజియాన్ని, రూ. 230 కోట్లతో 65 ఎకరాల్లో జాతీయ స్మారకం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా లఖ్ నవూలో మోడీ మాట్లాడుతూ.. బ్రహ్మోస్ క్షిపణులు లఖ్ నవూలోనే తయారవుతున్నాయని, లఖ్ నవూలో అతిపెద్ద డిపెన్స్ కారిడార్ ఉందని తెలియజేశారు. మొబైల్, ఇంటర్నెట్ వాడే దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉందని అన్నారు. భారత్ అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా 11 ఏళ్లలో మారిందని, మొబైల్ ఫోన్లు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంగా ఉందని ప్రశంసించారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ్, అటల్ బిహారీ వాజ్ పేయీ విగ్రహాలు, గొప్ప స్ఫూర్తినిస్తాయని, డిసెంబర్ 25న ఇద్దరు మహనీయులు జన్మించారని అన్నారు. భారత ఏకత్వానికి వాజ్ పేయీ, మదన్ మోహన్ మాలవీయ కృషి చేశారని, ప్రజల ప్రతి అడుగు జాతి నిర్మాణం దిశగా ఉండాలని ప్రేరణస్థల్ సందేశం ఇస్తుందని సూచించారు. నేతల విగ్రహాలు ఎంత ఎత్తు ఉన్నాయో.. వాటి వల్ల కలిగే ప్రేరణ అంత కంటే గొప్పదని, శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాల్ కలల సాకారానికి సంకల్పం తీసుకోవాలని మోడీ కోరారు.

జాతీయస్థాయి మహోత్సవంలో పద్మశ్రీ కనకరాజు బృందం ప్రదర్శన

ఆదిలాబాద్, డిసెంబర్ 26:కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24వ తేదీన విశాఖపట్నంలో జరిగిన జాతీయస్థాయి పెసా జాతీయ స్థాయి మహోత్సవ వేడుకల్లో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మార్లవాయి చెందిన పద్మశ్రీ కనకరాజు గుస్సాడి బృందం ఉత్సవాలలో పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారని అధికారులు శుక్రవారం తెలిపారు. గుస్సాడి బృందంతో పాటు పెసా అదిలాబాద్, అసిఫాబాద్ జిల్లా కోఆర్డినేటర్లు, ఉట్నూర్ పీఎంఆర్సి కోఆర్డినేటర్స్, ఇప్పపువ్వు లడ్డు తయారు నిర్వాహకులు ఇప్పపువ్వు, ఇతర ప్రదర్శనలు చేశారని తెలిపారు. కళాబృందాలను పెస కోఆర్డినేటర్ వర్గ వసంతరావు ఆధ్వర్యంలో 16 మంది గుస్సాడి కళాబృందాలు ఈ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ శిక్షణ అధికారి సుభాష్ చంద్ర గౌడ్ ఆధ్వర్యంలో గుసాడికల బృందాలు ప్రదర్శనలు నిర్వహించారని తెలిపారు.

ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ కు మయాంకరాజ్ పురోహిత్

మక్తల్,డిసెంబర్ 26: నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన ప్రముఖ బంగారు వ్యాపారవేత్త తాన్ సింగ్ రాజ్ పురోహిత్ గులాబ్ కవర్ రాజ్ పురోహిత్ కుమారుడు మయాంక్ రాజ్ పురోహిత్ ఇంటర్ స్టేట్ సబ్ జూనియర్ క్రికెట్ టోర్నీకి ఎంపికయ్యారు. హైదరాబాద్ తెలంగాణ స్కూల్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కే.అంజి, శ్రీరామ్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్ బాచుపల్లి శంకరి క్రికెట్ అకాడమీలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ క్రికెట్ ఎంపికలో మయాంక్ రాజ్ పురోహిత్ పాల్గొని, అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ కు ఎంపికైనట్లు విశ్రాంత పీఈటి బి.గోపాలం తెలిపారు.

ప్రస్తుతం మయాంక్ రాజ్ పురోహిత్ హైదరాబాద్ లో వెరిటాస్ సెంట్రల్ గవర్నమెంట్ సైనిక పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ కు ఎంపికైన మయాంక్ రాజ్ పురోహిత్ ఈనెల 27 నుండి 29 వరకు విశాఖపట్నం మెడ్‌ఓస్ క్రికెట్ గ్రౌండ్ లో జరుగనున్న టోర్నమెంట్ లో తెలంగాణ క్రికెట్ జట్టు తరుపున ఆడనున్నారని తండ్రి తాన్ సింగ్ రాజ్ పురోహిత్ తెలిపారు.

త్వరితగతిన కలెక్టరేట్ భవన సముదాయం పూర్తి చేయాలి

-వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, డిసెంబర్ 26: సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతనముగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టర్ కార్యాలయ భవనాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, రోడ్లు భవనాలు శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవన) నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. నమూనా ఏర్పాట్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

సంథాలీ భాషలో భారత రాజ్యాంగం ఆవిష్కరణపై ప్రధానమంత్రి హర్షం

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: భారత రాజ్యాంగం సంథాలీ భాషలో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించడంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై అవగాహనకు, ప్రజాస్వామ్యంలో జన భాగస్వామ్యం ఇనుమడించేందుకు ఇది తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు "సంథాలీ సంస్కృతి, దేశ పురోగమనంలో ఆ తెగ ప్రజల పాత్రపై దేశం ఎంతో గర్విస్తోంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా పంపిన సందేశంలో "ఇదొక ప్రశంసనీయమైన ప్రయత్నం! సంథాలీ భాషలో రాజ్యాంగం ఆవిష్కృతం కావడం మన రాజ్యాంగంపై అవగాహనను, ప్రజాస్వామ్యంలో జన భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తోడ్పడుతుంది. సంథాలీ సంస్కృతి, దేశ ప్రగతిలో ఆ తెగ ప్రజల పాత్రపై దేశం ఎంతగానో గర్విస్తోంది'' అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

రూ.8 లక్షల ప్రపోజల్ ఎల్ఓసి అందజేత

మక్తల్, డిసెంబర్ 26:మక్తల్ నియోజకవర్గంలోని నర్వ మండలం బెక్కరపల్లి గ్రామానికి చెందిన సరస్వతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం వశునంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడా అండ్ యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని సంప్రదించగా వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద 3 లక్షల రూపాయల ప్రపోజల్ ఎల్ఓసి కాపినీ మంజూరు చేశారు. అదేవిధంగా మక్తల్ మండలంలోని వనాయకుంట గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మమ్మకు రూ.5 లక్షల ఎల్ఓసి అందజేశారు. సంబంధిత ప్రపోజల్ ఎల్ఓసి కాపీలను ఇవాళ మంత్రి అధికారిక నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మంచి వైద్యం అంది, బాధితుడు త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

అంతర్రాష్ట్ర శిశు అక్రమ రవాణా ముఠా అరెస్ట్

-ఇద్దరు నవజాత శిశువులను సురక్షితంగా రక్షించడంతో పాటు 11 మంది నిందితుల అరెస్ట్

హైదరాబాద్ డిసెంబర్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);:మియాపూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు ఎస్ఓటీ (ఎస్ఓటి) బృందంతో కలిసి హైదరాబాద్ కేంద్రంగా పలేళుగా కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్రాష్ట్ర శిశు అక్రమ రవాణా ముఠాను ఛేదించారు.

ఈ ఘటన లో ఇద్దరు నవజాత శిశువులను సురక్షితంగా రక్షించడంతో పాటు 11 మంది నిందితులను అరెస్ట్ చేశారు. విస్వసనీయ సమాచారం మేరకు శిశువుల అక్రమ విక్రయాల్లో పాల్గొంటున్న ముఠాపై వల పన్ని,మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన నిందితులను వారి అనుచరులతో కలిసి అదుపులోకి తీసుకున్నాం. పేదరికంలో ఉన్న కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని డబ్బు ఆశ చూపి శిశువులను కొనుగోలు చేసి,పిల్లలు లేని సంపన్న కుటుంబాలకు భారీ మొత్తాలకు విక్రయించడమే ఈ ముఠా మోదస్ ఆపరెండీగా పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా వ్యవహరిస్తున్న బాబు రెడ్డి,గం గాధర్ రెడ్డి ఇప్పటికే సైబరాబా ద్,రాచకొండ,హైదరాబాద్ కమిషనరేట్ల పరిధిలో అనేక కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు .గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌తో పాటు తెలంగాణలోని సిద్ధిపేట జిల్లా ప్రాంతాల నుంచి అక్రమంగా శిశువులను తెచ్చి హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నించిన సమయంలో నిందితులను పట్టుకున్నారు. రక్షించబడిన ఇద్దరు నవజాత శిశువులను అమీర్‌పేట్‌లోని శిశు విహార్‌కు అప్పగించారు. ఈ అరెస్టులు మాధాపూర్ జోన్ డీసీపీ రితిరాజ్ ఐపీఎస్ పర్యవేక్షణలో జరగగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఈ విజయవంతమైన ఆపరేషన్‌ను అభినందించారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులు కాంగ్రెస్ తోనే సాధ్యం

లక్షెట్టిపేట, డిసెంబర్ 26: ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం కేవలం కాంగ్రెస్ తోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఇవాళ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని మోదేలలో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ రూ. 74.50 లక్షలు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంజూరు చేపించడం చరిత్రలో నిలిచిపోతోందన్నారు. రైతుల ఎన్నో ఏండ్ల కలను నెరవేర్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు.రైతులకు ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ ద్వారా న్యాయం చేసేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని వివరించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా ప్రేమ్ సాగర్ రావు కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలే నాటికీ నేటికీ ఇరిగేషన్ రంగంలో ఎనలేని కృషి చేశాయని, చేస్తున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్లా నాగభూషణం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, ఆర్టీఏ మెంబర్ శ్రీనివాస్, నాయకులు పూర్ణ చందర్, మసాలా సతీష్, తోట రమేష్, నగేష్, వెంకటేష్, రాజు, లచ్చన్న కాంతయ్య, షాహిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు రాజకీయంగా ఎదగాలి

భీమ్‌గల్‌డిసెంబర్ 26: గిరిజన నాయకులు రాజకీయంగా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని జిల్లా బంజారా సేవ సంఘం గౌరవ అధ్యక్షులు భూక్యా చంద్రునాయక్, మున్సిపల్ శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ మాలోత్ నరహరి నాయక్, జిల్లా బంజారాసేవ సంగ్ అధ్యక్షులు మూడ్ బాబురావ్ నాయక్ సూచించారు. ఇవాళ పట్టణంలోని బంజారా భవన్ లో బంజారాసేవ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో బాధవత్ శర్మ నాయక్ అధ్యక్షతన ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. బంజారా జాతి గౌరవం పెంచేలా రాజకీయాలు చేయాలని సూచించారు. గిరిజన నాయకులు, ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా.. పార్టీలకు అతీతంగా ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో) విజయం సాధించిన వారిని అభినందించడంతో పాటు పూలమాల, శాలువాతో సత్కరించారు. జాతి గౌరవం పెంచడంతో పాటు గిరిజన గ్రామపంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారాసేవ సంఘ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాధవత్ గోపాల్ నాయక్, తుక్కాజీ నాయక్, బోర్ లింగం, మాలవత్ వెంకటేష్, గోవింద్ నాయక్, రాజు నాయక్, సంగ్యా నాయక్, బాబూలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

భారత ఫార్మకోపియా కమిషన్ పురోగతి, చొరవలపై కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జె పి నడ్డా సమీక్ష

న్యూఢిల్లీ, డిసెంబర్ 26 :కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా ఈరోజు ఇండియన్ ఫార్మకోపోయియా కమిషన్ పురోగతి మరియు చొరవలను కెమికల్స్ మరియు పెట్రో-కెమికల్స్ శాఖ కార్యదర్శి మరియు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీమతి నివేదిత శుక్లా వర్మ సమక్షంలో సమీక్షించారు.

ఫార్మకోపోయియల్ ప్రమాణాలు మరియు ఫార్మకోవిజిలెన్స్ కార్యకలాపాలను బలోపేతం చేయడంలో ఐపిసి నిరంతర కృషిని శ్రీ నడ్డా ప్రశంసించారు, ఇవి ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్ మరియు విక్షిత్ భారత్ దార్శనికతకు దోహదపడతాయి, ఇది స్వావలంబన, శాస్త్రీయ శ్రేష్ఠత మరియు బలమైన ఆరోగ్య సంరక్షణ ప్రమాణాలను ప్రోత్సహిస్తుంది.

సమీక్ష సందర్భంగా, ఔషధాల నాణ్యత, భద్రత మరియు సామర్థ్యాన్ని నిర్ధారించడంలో, తద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ఐపిసి కీలక పాత్ర పోషించినందుకు శ్రీ నడ్డా ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఔషధాల ఏకరీతి ప్రమాణాలను నిర్ధారిస్తూ, ఇండియన్ ఫార్మకోపోయియా ఒక కీలకమైన శాస్త్రీయ మరియు నియంత్రణా సూచనగా మిగిలిపోయిందని ఆయన పేర్కొన్నారు.

"భారతదేశం యొక్క నియంత్రణ మరియు శాస్త్రీయ సామర్థ్యాలపై అంతర్జాతీయంగా పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ, ఇండియన్ ఫార్మకోపోయియా ఇప్పుడు 19 దేశాలలో గుర్తింపు పొందింది'' అని మంత్రి హైలైట్ చేశారు. "ఈ గుర్తింపు ప్రపంచ ఫార్మసీగా భారతదేశం యొక్క స్థానాన్ని బలపరుస్తుంది మరియు ప్రపంచవ్యాప్తంగా భారతీయ ఫార్మకోపోయియల్ ప్రమాణాల విశ్వసనీయతను నొక్కి చెబుతుంది" అని ఆయన గమనించారు. దీనికి అదనంగా, ఇండియన్ ఫార్మకోపోయియా 2026 యొక్క 10వ ఎడిషన్‌ను కేంద్ర ఆరోగ్య మంత్రి 2026 జనవరి మొదటి వారంలో ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో, దుష్ప్రభావ ఔషధ ప్రతిచర్యలను పర్యవేక్షించడానికి మరియు రోగి భద్రతను నిర్ధారించడానికి ఫార్మాకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా అమలులో ఎఐఅ కీలక పాత్రను శ్రీ నడ్డా నొక్కిచెప్పారు మరియు రిపోర్టింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడానికి మరియు ఆరోగ్య సంరక్షణ నిపుణులలో సామర్థ్యాన్ని పెంపొందించడానికి దాని ప్రయత్నాలను ప్రశంసించారు. ప్రపంచ ప్రజారోగ్యానికి మద్దతు ఇస్తూనే, స్వదేశీ శాస్త్రీయ నైపుణ్యం మరియు నియంత్రణ ప్రమాణాలను బలోపేతం చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్‌కు ఎఐఅ చేసిన సహకారాన్ని కూడా ఆయన ప్రశంసించారు. సురక్షితమైన మరియు నాణ్యమైన ఔషధాలకు సార్వత్రిక ప్రాప్యతను నిర్ధారించడానికి, విక్షిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఆవిష్కరణ, డిజిటలైజేషన్ మరియు ప్రమాణాల ప్రపంచ సమన్వయంపై దృష్టి పెట్టడం కొనసాగించాలని మంత్రి ప్రోత్సహించారు. కార్యకలాపాల వివరాలను సెక్రటరీ-కమ్-సైంటిఫిక్ డైరెక్టర్ డాక్టర్ వి. కలైసెల్వన్ సమర్పించారు మరియు ఫార్మకోపోయియల్ మరియు ఫార్మకోవిజిలెన్స్ ప్రమాణాలను మరింత బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ సహకారాన్ని మెరుగుపరచడానికి మరియు జాతీయ మరియు ప్రపంచ ఆరోగ్య లక్ష్యాలకు దోహదపడటానికి నిబద్ధతను ఆయన మరింతగా ధృవీకరించారు.

వేయిస్తంభాల దేవాలయం అద్భుతమైన శిల్పకళ

- హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ డిసెంబర్ 26: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వారి సతీమణి బంధువులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికి ఉత్తిష్టగణపతికి దర్శనం అనంతరం రుద్రేశ్వరస్వామికి వారి గోత్రనామాలులతో లఘు రుద్రాభిషేకం నిర్వర్తింపజేసి ఆలయ నాట్యమండపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.అనిల్‌కుమార్ తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. వేదఆశీర్వచనం నిర్వర్తించి ఆలయప్రాశిస్తాన్ని ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేందర్‌శర్మ వారికి వివరించారు.

సూర్య, విష్ణు ఆలయాల చరిత్ర నాట్యమండపం, స్తంభాలపై వెంట్రుక పట్టే అటువంటి రంధ్రాలు, జిట్టెడు ఆంజనేయస్వామి, తలకిందులచాప తలకిందుల మనిషి, అష్టదిక్పాలకులు గాయత్రిమాత, కళ్యాణమండపం విశేషాలను వారికి వివరించారు. వారు అద్భుతమైన శిల్పకళా అని తెలంగాణ రాష్ట్రంలో ఉండడం మనకు గర్వకారణమన్నారు. కాకతీయులు భారత సంస్కృతిని సాంప్రదాయాన్ని ప్రతిబింబించేవిధంగా అద్భుత శిల్పకలని అందించారని ఆయన పేర్కొనారు. వారసత్వ సంపదలను సమాజం కాపాడుకోవాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్‌శర్మ, సందీప్‌శర్మ, మణికంఠశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలను నిర్వర్తించారు. వారికి ఆలయ సిబ్బంది మధుకర్, రజిత,రామకృష్ణ సేవలందించారు. సెలవుదినం కావడంతో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చారు.

కేజీబీవీ విద్యార్థినికి అస్వస్థత.. హాస్పిటల్‌కు తరలింపు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని భాను గురువారం స్వల్ప అస్వస్థతకు గురైంది. విషయం గమనించిన పాఠశాల నిర్వాహకులు బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి దవాఖానలో చికిత్స చేయించి ఇంటికి పంపించారు. విద్యార్థికి డైజేషన్ కాకపోవడంతో స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలిపారు.

అయితే ఇంటికి వెళ్లాక కూడా మళ్లా అస్వస్థతకు గురికాగా.. కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించి చికిత్స చేయించగా.. శ్వాస సంబంధ వ్యాధిగా వైద్యులు గుర్తించారు. కాగా, గురువారం ఉదయం అల్పాహారంలో బోండాలు తినడంలో ముగ్గురు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు సోషల్ మీడియాతోపాటు, కొన్ని దినపత్రికల్లో వచ్చిన వార్తపై శుక్రవారం కలెక్టర్ సంతోష్ స్పందించారు. జిల్లా అధికారులను కేజీబీవీని సందర్శించి సమగ్ర నివేదికను తెప్పించి పరిశీలించారు.

ఆల్ఫా హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

నల్గొండ, డిసెంబర్ 26: రామన్నపేట పట్టణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆల్ఫా హై స్కూల్ 1993?96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఎంతో ఉత్సాహభరితంగా, భావోద్వేగంగా కొనసాగింది. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, విద్యార్థి దశలోని అనుభవాలు, గురువుల సహకారం, పాఠశాల జీవితంలోని మధుర క్షణాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాటి గురువులను పూల వర్షంతో, పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. విద్యార్థుల స్వీయ పరిచయంతో ప్రారంభమైన ప్రసంగం జీవితంలోని మధుర జ్ఞాపకాలను పంచుకునే వేదుకగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆల్ఫా హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సురేశ్, మమతా, అస్మత్ ఉన్నీసా, పూర్వ విద్యార్థులు భవాని, ఉమా, రజిత, వరలక్ష్మి, సర్ధ చంద్రశేఖర్, మహమ్మద్ రఫీ, మహమ్మద్ ముస్తాక్ అలీ, తడకమళ్ల చంద్రశేఖర్, రత్న మధు బాబు, పొట్ట రవి, బొల్లం శ్రీనివాస్, శంభాల ఆంజనేయులు, ఎదుగాని మహేందర్, వెంకన్న చారి, గర్దాసు ఉపేందర్, డాక్టర్ కల్యాణ వరప్రసాద్, మందాడి నవీన్ రెడ్డి, చెరుకు ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం కోకాపేటలో గౌడ భవనాన్ని నిర్మించాలి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 26:: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గౌడ కులస్తుల కోసం కోకాపేటలో 5 కోట్ల రూపాయలతో కేటాయించిన 5 ఎకరాల స్థలంలో ప్రభుత్వం వెంటనే గౌడ భవనాన్ని నిర్మించాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ (రాతినితిలజీబ ఉనీబీట)అన్నారు. గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(గోపా)ఆధ్వర్యంలో గోపా స్వర్ణోత్సవాలను కాచిగూడ మున్నూరుకాపు సంఘం మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేకుమార్‌గౌడ్, శాషనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, జస్టిస్ ఈశ్వరయ్య హాజరయ్యారు.

అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు అర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైన్ షాపులలో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించామన్నారు. కులవృత్తి ఆత్మగౌరవం పెంపొందించడం కోసం ట్యాంక్ బండ్‌పై నీరా కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం వీటిని పట్టించుకోక పోవడంతో మరుగున పడుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మిాసీ కమిషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, చక్రవర్తి, అంబాల నారాయణగౌడ్, కిషోర్‌గౌడ్, పల్లె రవి, బాల్‌రాజుగౌడ్, జీవోపీఏ బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి జివి శ్రీనివాస్‌గౌడ్, రఘునాథ్‌గౌడ్, రామ్మోహన్‌గౌడ్, మీరయ్యగౌడ్, శారద గౌడ్, ఎన్.రమేశ్‌గౌడ్, మహేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన తర్వాత కూడా.. టీచర్ తలపై కాల్చుతూనే ఉన్న దుండగులు

లక్నో, డిసెంబర్ 26: రాత్రి వేళ వాక్ చేస్తున్న ఒక టీచర్‌ను ఇద్దరు వ్యక్తులు కాల్చి చంపారు. అయితే ఆయన కిందపడి చనిపోయినప్పటికీ దుండగులు అతడి తలపై కాల్చుతూనే ఉన్నారు. సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో ఈ సంఘటన జరిగింది. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఏబీకే హైస్కూల్‌లో కంప్యూటర్ సైన్స్ టీచర్‌గా డానిష్ రావు 11 ఏళ్లుగా పని చేస్తున్నారు.

కాగా, డిసెంబర్ 24న రాత్రి వేళ తన సహోద్యోగులతో కలిసి డానిష్ రావు వాకింగ్ చేస్తున్నారు. ఇంతలో ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై అక్కడకు వచ్చారు. డానిష్ రావును అడ్డగించి ఆయనపై కాల్పులు జరిపారు. రోడ్డుపై నిర్జీవంగా పడి ఉన్న ఆయన తలపై ఒక వ్యక్తి గన్ ఉంచి కాల్పులు జరుపుతూనే ఉన్నాడు. 'నేను ఎవరో నీకు తెలియదా ఇప్పుడు నీకు తెలుస్తుంది' అని కాల్పులకు ముందు ఒక వ్యక్తి ఆయనతో అన్నాడు.

మరోవైపు టీచర్ డానిష్ రావును కాల్చి చంపిన తర్వాత ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. ఇది చూసి అక్కడున్న వారు భయాందోళనతో పరుగులు పెట్టారు. డానిష్ రావు హత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ నేపథ్యంలో బుల్లెట్ గాయాలతో చనిపోయిన డానిష్ రావు తలపై ఒక నిందితుడు కాల్చుతూనే ఉన్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించొద్దు : మెతుకు ఆనంద్

వికారాబాద్, డిసెంబర్ 26 : పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించరాదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పంచాయతీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కావలి జ్యోతి భర్త కావలి నరేష్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలనే లక్ష్యంగా చేసుకొని పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు.

ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా పోలీసులు పారదర్శకంగా పనిచేయాలని కోరారు. అక్రమంగా కేసులు పెట్టడంతో ఇబ్బంది పడుతున్న కావలి నరేష్ , బీఆర్ఎస్ పార్టీ నాయకులతో మాట్లాడి అధైర్యపడుద్దని, ఎల్లవేళలా అండగా ఉంటానని ధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రమేష్ గౌడ్, అనంత్ రెడ్డి, సీనియర్ నాయకులు బూరుగుపల్లి శ్రీనివాస్ రెడ్డి, వికారాబాద్ మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, మండల కార్యనిర్వాహక అధ్యక్షులు పడిగళ్ల అశోక్, మండల మైనారిటీ విభాగం అధ్యక్షులు గయాజ్, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న హరీశ్ రావు.. బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

సంగారెడ్డి, డిసెంబర్ 26:: మాజీ మంత్రి హరీశ్ రావుమరోసారి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చెందిన బేగరి రాములును గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమకు ఓటు వేయలేదనే ద్వేషంతో సర్పంచ్, ఆమె కుమారుడు ప్రసాద్ రెడ్డి రాములుకు చెందిన ఇంటిని జేసీబీతో ఈ నెల23వ తేదీన కూల్చివేశారు.

దీంతో తమకు న్యాయం చేయాలని బాధితుడు హరీశ్ రావుతో మొరపెట్టుకున్నారు. స్పందించిన హరీశ్ రావు తనవంతుగా లక్ష రూపాయలను అందజేస్తానని హామీ ఇచ్చారు. కాగా, హరీశ్ రావు అందదించిన నగదును లక్ష రూపాయల నగదును శుక్రవారం జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు చేతుల మీద అందజేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

నల్గొండ, డిసెంబర్ 26: వీధి కుక్కలు చేసిన దాడిలో నాలుగేండ్ల బాలిక తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన గద్దల వెన్నెల(4) అనే బాలికపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కుక్కల దాడిలో బాలిక మూతికి తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు కుక్కను వెంబడించడంతో ప్రాణాపాయం తప్పింది. చికిత్స కోసం బాలికను వెంటనే సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామాల్లో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

గురు గోవింద్ సింగ్ కుమారుల వీరత్వానికి నివాళి

కరీంనగర్, డిసెంబర్ 26:: (నేటినిజం ప్రతినిధి) పదవ శిక్కుల గురువు గురు గోవింద్ సింగ్ జి యువకుమారుల అసాధారణ ధైర్యం, త్యాగాన్ని స్మరించుకుంటూ, వారి వీరత్వానికి నివాళిగా ప్రతి ఏటా డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ నిర్వహించడం జరుగుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. గురు గోవింద్ సింగ్ చిన్న కుమారులు సాహిబ్ జాదా జోరావర్ సింగ్ (9 ఏళ్ళు), సాహిబ్ జాదా ఫతేసింగ్ (7 ఏళ్లు) అసాధారణ ధైర్య సాహసాలను ప్రదర్శించి, ధర్మరక్షణ, హైందవ ధర్మ రక్షణే ధ్యేయం కోసం నిలబడి మొఘల్ సామ్రాజ్యానికి ఎదిరించారన్నారు. డిసెంబర్ 26న సజీవ సమాధి కాబడిన ఆ వీర బాలల త్యాగం ఎందరికో స్ఫూర్తి దాయకమన్నారు. అభం శుభం తెలియని వయసులోనే ఆత్మాభిమానాన్ని చాటి దేశం కోసం, ధర్మం కోసం గోడల మధ్య బంధింపబడి, బలిదానమైన జోరావర్ సింగ్, ఫతే సింగ్ ల ధైర్య, శౌర్య సాహసాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ వీర్ బాల్ దివస్‌ను అధికారికంగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. భారతదేశంలో పిల్లల త్యాగాలను గౌరవించడానికి, అంకితం చేయబడిన మొదటి జాతీయ దినోత్సవం డిసెంబర్ 26 అని తెలిపారు. గురు గోవింద్ సింగ్ జి కుమారుల వీరత్వం బ్రావితంగా లక్షలాది స్ఫూర్తిదాయకమన్నారు. వీర బాలుల ధైర్యం, విశ్వాసానికి గౌరవం తెస్తూ, వారి త్యాగాన్ని స్మరించుకుంటూ నేటి పిల్లల్లో ధైర్యం, నిబద్ధతను పెంపొందించడమే వీర్ బాల్ దివస్ ముఖ్య ఉద్దేశం అన్నారు.

వేములవాడ జనకల 17వ వార్షికోత్సవం వేడుకలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 26:నేటినిజం (ప్రతినిధి): వేములవాడ జనకల 17వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ జవ్వాజి అంజయ్య గౌడ్‌కు వేములవాడ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కోహినేని బాలయ్య, వేములవాడ మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు నామాల పోశెట్టి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్ మారం కుమారు పులి మధుకర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ అధ్యక్షులు పొలాస నరేందర్, నాగారం శ్రీనివాసులు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు, అడ్వకేట్లు, అధికారులు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, సిటీ కేబుల్ అధినేత, ఎన్ని కేబుల్ అధినేత, ఉమ్మడి జిల్లా బీసీ నేతలు మాట్లాడుతూ, జనకల వార్షికోత్సవం వేదిక పెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ వేదిక పైకి ముఖ్య అతిథులుగా పిలవడం చాలా సంతోషంగా అభివర్ణించారు. డాక్టర్ జవాజి అంజయ్య గౌడ్ మాట్లాడుతూ, ఈరోజు జనగల వేదిక 17వ సంవత్సరం వేడుకల్లో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. మాకు ఘన సన్మానం చేసి మా చిరు సత్కారం అందుకున్నందుకు వచ్చిన ప్రముఖులు పెద్దలకు అందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

అర్హులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాల్సిందే..

అందుకోసమే ఐక్య పోరాటాలు డబ్ల్యూజే రాష్ట్ర నేతలు కరుణాకర్, ప్రమోద్ కుమార్

జగిత్యాల్ డిసెంబర్, 26:అక్రిడిటేషన్ల విషయంలో రాష్ట్రం లోని జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటిస్తామని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివవనాద్రి ప్రమోద్ కుమార్ తెలిపారు .జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన పలువురు జర్నలిస్టులు శుక్రవారం వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియాలో చేరిన సందర్భంగా వారిని స్వాగతించారు. జస్టిన్ కుమారయ్య వేడుకల మందిరంలో జరిగిన కార్యక్రమంలో డబ్ల్యూజెఐ నేతలు మాట్లాడుతూ... నూతన అక్రిడిటేషన్లకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అసమంజసంగా, అసంబద్ధంగాఉన్నాయని ఆరోపించారు. ఈ విషయంలో రాష్ట్రంలోని జర్నలిస్టులకు న్యాయం జరిగేంతవరకు తమ పోరు ఆగబోదని స్పష్టం చేశారు. కలసి వచ్చే అన్ని జర్నలిస్టు సంఘాలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం విషయంలో తమ సంఘం నిబద్ధతగా పనిచేస్తుందని చెప్పారు. జర్నలిస్టులను తమ స్వప్రయోజనాల కోసం వాడుకొని వదిలేసే సంఘాల నాయకత్వ తీరు చూసి అనేకమంది తమతో కలిసి రావడానికి ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. వారి ఆశలు ఆకాంక్షలు నెరవేర్చే దిశగా తమ సంఘం పని చేస్తుందని చెప్పారు. పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో జర్నలిస్టులు తమ సమస్యల పరిష్కారం కోసం దశాబ్ద కాలానికి పైగా ఎదురుచూపులు చూడడం దురదృష్టకరం అన్నారు. కేవలం ఒక సంఘ నాయకుని సలహాలు, సూచనలు ప్రభుత్వం పాటించడం ప్రస్తుతం రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న దుస్థితికి కారణం అన్నారు. తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కొడిమ్యాల మండల వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గానికి యూనియన్ నేతలు కరుణాకర్, ప్రమోద్ కుమార్, కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

కాకా వెంకట్ స్వామి మెమోరియల్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ముగింపు

కరీంనగర్, డిసెంబర్ 26:: (నేటినిజం ప్రతినిధి) హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అలుగునూరు వద్ద గల వెలిచాల జగపతి రావు మెమోరియల్ గ్రౌండ్‌లో కాకా వెంకట్ స్వామి మెమోరియల్ తెలంగాణ అంతర్ జిల్లా టీ-20 లీగ్ ఫైనల్ ముగింపు మ్యాచ్ నిర్వహించారు. దీనికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విచ్చేశారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో తగ్గిన నేరాలు : ఎస్పీ శ్రీనివాస రావు

జోగుళాంబ డిసెంబర్ 26: నేరాల తగ్గుదల, వేగవంతమైన దర్యాప్తు, ప్రజాభద్రతే పోలీసుల లక్ష్యమని జోగుళాంబ గద్వాల్ జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 2025 సంవత్సరానికి సంబంధించిన జిల్లా పోలీస్ శాఖ వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన శాంతిభద్రతలు, నేర నియంత్రణ, మహిళలు బాలికల భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణలో సాధించిన విజయాలను వివరించారు.

2025 సంవత్సరంలో జిల్లా పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా రోజువారీ విధులతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ప్రజలకు నిరంతర సేవలు అందించారని ఎస్పీ తెలిపారు. 2025లో జిల్లాలో సంచలనం సృష్టించిన పలు హత్య కేసులను సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో అత్యంత వేగంగా ఛేదించిందని వెల్లడించారు. గద్వాల్ టౌన్, , శాంతినగర్, ధరూర్ పరిధిలో జరిగిన హత్యలను ప్రమాదాలుగా చూపే ప్రయత్నాలను భగ్నం చేసి నిందితులను అరెస్ట్ చేసి నగదు, వాహనాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. శాంతినగర్ పరిధిలో అప్పు పేరుతో హైదరాబాద్‌కు పిలిపించి కిడ్నాప్ చేసిన కేసును కేవలం 8 గంటల్లోనే ఛేదించి బాధితుడిని పోలీసులు శాఖ సురక్షితంగా కాపాడిందని పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని చెప్పారు. ఎన్నికల తనిఖీల్లో రూ.3,50,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 3 కేసులు నమోదు చేసి, 174 మెమోలు జారీ చేసి, 303 మందిని బైండోవర్ చేశామని వివరించారు. నాకాబందీ ఆపరేషన్లతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. నేర నియంత్రణలో భాగంగా 2024లో నమోదైన 2,703 కేసులు, 2025లో 2410కు తగ్గాయని, దీంతో నేరాల రేటు సుమారు 11 శాతం తగ్గినట్లు ఎస్పీ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు 2024లో 6, 359 కేసులు నమోదు కాగా 2025లో 5270 దరఖాస్తులను స్వీకరించి తక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ షీ టీమ్స్, పోలీసు కళాబృందం, భరోసా కేంద్రం ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. "ప్రజాభద్రత పోలీసు బాధ్యత" అనే నినాదంతో గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, కళాశాలల్లో ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. భరోసా కేంద్రంలో 81 కేసులు నమోదు కాగా, అన్ని కేసుల్లో కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు 35 మంది బాధితులకు నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. జిల్లా షీ టీమ్స్ ద్వారా 136 అవగాహన సదస్సులు నిర్వహించగా, 122 ఫిర్యాదులు స్వీకరించి, 133 పిటీ కేసులు, 9 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వివరించారు.

కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ లోకి చేరిన రుద్రవరం ఉప సర్పంచ్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 26:నేటినిజం (ప్రతినిధి): రుద్రవరం గ్రామ ఉపసర్పంచ్ బెజగం మహేష్, 10వ వార్డు సభ్యుడు బాణాల రాజులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన రుద్రవరం ఉప సర్పంచ్ బెజగం మహేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అభివృద్ధి కేవలం కేసీఆర్ తోనే సాధ్యమని తెలిపారు.

కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తూ నల్లజెండాలతో నిరసన

నల్గొండ, డిసెంబర్ 26: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం దగ్గర నల్ల జెండాలతో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతాంగం నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన సందర్భంగా కనీస మద్దతు ధర చట్టం చేస్తామని విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చి దొడ్డిదారిన అమలు చేయడానికి కుట్ల చేస్తుందన్నారు. స్వాతంత్రానికి ముందు కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, కార్పొరేట్ అనుకూల కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా యూపీఏ పన్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేసి వికిజి రాంజీ అనే కొత్త చట్టాన్ని తీసుకొచ్చారని, దీని ద్వారా రాష్ట్రాలకు 40 శాతం నిధులు వాటా ఉండాలని చెప్పడం వలన ఈ పథకం నిర్వీర్యమై పనులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులకు ఉన్న కొద్దిపాటి హక్కులను కూడా తొలగించి కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా తెస్తున్న చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని దశలవారీ గా జనవరి 19 కార్మిక కర్షక మైత్రి దినోత్సవం వరకు గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యపరిచి ఉద్యమంలోకి తీసుకొస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల, సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ, బొజ్జ చిన్న వెంకులు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్, రైతు సంఘం జిల్లా నాయకుడు కుంభం కృష్ణారెడ్డి, సిఐటియు పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, సంఘాల నాయకులు గంజి నాగరాజు మన్నెం భిక్షం, పోలే సత్యనారాయణ, సర్దార్ అలీ, కట్ట అంజయ్య, బొల్లు రవీందర్, గంజి రాజేశ్, ఆవుల అనురాధ, సల్లోజు విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలి: కలెక్టర్ రాహుల్ రాజ్

టేక్మాల్, డిసెంబర్ 26:వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్‌అన్నారు. టేక్మాల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ, ఫార్మసీ, ల్యాబ్, టాయిలెట్స్, పరిశీలించారు. వైద్యులు, అధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికి అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నామని తెలిపారు. వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దమ్ముంటే రాజీనామా చేసి గెలువు.. అరికెపూడి గాంధీకి కేటీఆర్ సవాలు

హైదరాబాద్, డిసెంబర్ 26: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లోనే ఉంటే.. అనిల్ రెడ్డి పార్టీలో చేరినప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దమ్ముంటే రాజీనామా చేసి ఉప ఎన్నికకు రావాలని అరికెపూడి గాంధీకి సవాలు విసిరారు. ఎమ్మెల్యే పేరులో గాంధీ మాత్రమే ఉందని.. కానీ చేసేది భూకబ్జాలు అని విమర్శించారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు దోసల అనిల్ ఇవాళ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అల్విన్ కాలనీలో సమావేశం పెడతామంటే ఫంక్షన్ హాలు యజమాని బెదిరించాడని తెలిపారు.

హైదరాబాద్ చరిత్రలో ఎవరితో సంబంధం లేకుండా బీఆర్ఎస్‌కు జీహెచ్ఎంసీ కార్పొరేషన్‌ను అప్పజెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని 23 ఎమ్మెల్యేలను గెలిపించారని అన్నారు. హైదరాబాద్ వాసులందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌కు పట్టం కట్టారని తెలిపారు. 40శాతం సర్పంచ్‌లను బీఆర్ఎస్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సరైన నాయకులకు అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. స్థానిక నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంతో కొట్లాడి పనులు చేయిస్తామని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు గెలిస్తే కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేస్తారంటా అని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌ను ఎన్ని ముక్కలు చేసినా ఓట్లు వేసేది ప్రజలే అని అన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు భూకబ్జాలు చేస్తున్నాడని కేటీఆర్ అన్నారు. మంత్రి కొడుకుపై కేసు పెట్టిన అబీబుల్లాఖాన్‌ను బదిలీ చేశారని తెలిపారు. గన్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ కూతురే స్వయంగా చెప్పిందని గుర్తుచేశారు.

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత అనిల్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 26: బీఆర్ఎస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ నేత దోసల అనిల్ రెడ్డికి గులాబీ కండువా కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు నోటిని అదుపులో పెట్టుకోవాలని సూచించారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఏ పార్టీలో ఉన్నాడో కూడా చెప్పడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కూర్చోవడం లేదని అన్నారు.

కేటీఆర్ నాయకత్వంలో గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 99 సీట్లు గెలిచామని మాధవరం గుర్తుచేశారు. బీఆర్ఎస్ సింగిల్‌గా జీహెచ్ఎంసీ మేయర్ పీఠాన్ని స్వాధీనం చేసుకుందని తెలిపారు. కార్యకర్తలు, ప్రజలను కాపాడుకున్నవాడే నాయకుడు అవుతాడని అన్నారు.

రాత్రి 2గంటల వరకూ ఎంఎంటీఎస్

డిసెంబర్ 26: కొత్త ఏడాది (2026) వేడుకల వేళ హైదరాబాద్ నగరవాసులకు దక్షిణ మధ్య రైల్వే ఊరటనిచ్చే వార్త అందించింది. జనవరి 1వ తేదీన అర్ధరాత్రి వేడుకలు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, నగరంవ్యాప్తంగా ఓఓ ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. లింగంపల్లి నుండి నగరంలోని ఇతర ప్రాంతాలకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి.లింగంపల్లి - నాంపల్లి: జనవరి 1వ తేదీ రాత్రి 1:15 గంటలకు లింగంపల్లి నుంచి బయలుదేరి, 1:55 గంటలకు నాంపల్లి స్టేషన్ చేరుకుంటుంది. ఈ రైలు చందానగర్, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, బోరబండ, భరత్ నగర్, బేగంపేట, ఖైరతాబాద్, లక్డీకాపూల్ వంటి కీలక స్టేషన్లలో ఆగుతుంది.లింగంపల్లి - ఫలక్‌నుమా: అర్ధరాత్రి 1:30 గంటలకు మరో ప్రత్యేక రైలు లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు నడుస్తుంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com